ప్రజాశక్తి

శనివారం 4 ఫిబ్రవరి 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

నేడు జెడ్‌పి సమావేశం

- బడ్జెట్‌కు ఆమోదం తెలపనున్న పాలకమండలి
- హాజరు కానున్న ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం శనివారం గుంటూరులోని జెడ్‌పి సమావేశ మందిరంలో శనివారం నిర్వహించనున్నారు. సమావేశానికి జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షత వహిస్తారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశం మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే అవకాశం ఉంది. సమావేశంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల ప్రజా ప్రతినిధులు, కలెక్టర్లు, జెడ్‌పిటిసిలు, ఇతర అధికారులు పాల్గొని ప్రజా సమస్యలపై చర్చించనున్నారు. ప్రధానంగా సమావేశంలో 2022-23 సవరణ బడ్జెట్, 2023-24 ఆర్థిక సంవత్సరానికి అంచనాల బడ్జెట్‌ను ఆమోదించనున్నారు. ఈ బడ్జెట్ ప్రతిపాదనలపై తొలుత చర్చించి ప్రతిపాదనలు ఆమోదం తరువాత ఇతర అంశాలను చర్చిస్తారని జిల్లా పరిషత్ సిఇఒ జె.మోహనరావు తెలిపారు.

2022-23 ఆర్థిక సంవత్సరంలో సవరణ బడ్జెట్ 1098.24 కోట్ల రాబడిగా చూపగా, 1096.97 కోట్లు ఖర్చుగా చూపారు. మిగులు రూ.కోటి 27 లక్షలుగా చూపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1154.47 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు రూపొందించగా



రూ.1152.96 కోట్ల వ్యయంగా చూపారు. రూ.1.50 కోట్ల మిగులు ఉన్నట్టు పేర్కొన్నారు. ఈ మేరకు ఇటీవల జరిగిన మొదటి స్థాయి సంఘ సమావేశంలో బడ్జెట్ ప్రతిపాదనలపై ఆమోదం తెలిపారు. సర్వసభ్య సమావేశం ఆమోదం తరువాత ప్రభుత్వానికి పంపుతారు. బడ్జెట్ ఆమోదం తరువాత జరిగే చర్చలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై చర్చించే అవకాశం ఉందని, సభ్యులు సమావేశంలో ప్రస్తావించడానికి చైర్‌పర్సన్ అవకాశం ఇస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

మరోవైపు జిల్లాలో వేసవి సమీపిస్తుండటంతో తాగునీటి సమస్యలపై చర్చించే అవకాశం ఉంది. ఇప్పటికీ చాలా గ్రామాలను తాగునీటి సమస్య వేధిస్తోంది. జల్‌జీవన్ మిషన్ పనులు మందగమనంగా సాగుతున్నాయి. ధాన్యం కొనుగోలులో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వ్యవసాయం, నీటి పారుదల శాఖ, విద్య, వైద్య రంగాలకు సంబంధించి చర్చకు అవకాశం ఉంది. ప్రదానంగా పదో తరగతి పాఠశాల విద్యార్థులకు సిలబస్ పూర్తికాకపోవడం, పాఠశాలలో ఉపాధ్యాయు కొరత తదితర సమస్యలున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది సక్రమంగా రాకపోవడం, వైద్య సేవల్లో ఇబ్బందులపై తరచూ జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు ప్రస్తావిస్తున్నా అధికారుల నుంచి ఆశించిన మెరుగుదల, స్పందన కన్పించడం లేదు. రబీ పంటలకు సాగు నీరు సరఫరా, గుంటూరు ఛానల్ పనుల పురోగతి, వరికపూడిసెల తాజా పరిస్థితిపై చర్చించే అవకాశం ఉంది. మిర్చికి రెండో ఏడాది ఎదువరవుతున్న తెగుళ్ల బెడద, ఇబ్బడి ముబ్బడిగా పురుగు మందుల వినియోగంపైనా సభ్యులు ప్రస్తావించే అవకాశం ఉంది. రహదారులు అభివృద్ధికి సంబంధించిన అంశాలను జెడ్‌పిటిసిలు ప్రస్తావించనున్నారు.

కళాతపస్వి విశ్వనాథ్ అడుగుజాడలు

ఉమ్మడి గుంటూరు జిల్లాతో విడదీయరాని అనుబంధం

8 లో

యుటిఎఫ్ నేతలపై నిర్బంధం

పలువురి అరెస్ట్, నోటీసులు జారీ

ప్రజాశక్తి-గుంటూరు

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ అన్నారు. సిపిఎస్ రద్దు చేసి, ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ రాష్ట్ర కమీటీ గన్నవరంలో చేపట్టిన సంకల్పదీక్షను భగ్నం చేయటానికి పోలీసులు యత్నించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్‌కు నోటీలిచ్చారు. కళాధర్‌ను శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల వరకూ అరండల్‌పేట పోలీసు స్టేషన్‌లో ఉంచి, తర్వాత విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాధర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్ని ఆటంకాలు సృష్టించాలని ప్రయత్నించినా సంకల్పదీక్షలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఉద్యమాలు చేసే హక్కును కాలరాయటం ప్రభుత్వానికి తగదని, అణచివేత వల్ల పోరాటం పెరుగుతుందేగాని తగ్గదనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు.





కెఎస్ లక్ష్మణరావుకు నోటీసు అందచేస్తున్న పోలీసులు, పోలీసు స్టేషన్‌లో ఉన్న కళాధర్

అధిక ధరలకు యూరియా విక్రయం

3.45 మెట్రిక్ టన్నులు సీజ్

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

అధిక ధరలకు విక్రయిస్తున్నారనే సమాచారంతో సత్తెనపల్లి పట్టణంలోని పలు ఎరువులు, పురుగు మందులు దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేశారు. సురేష్ ఎంటర్ ప్రైజెస్‌లో యురియా బస్తాను రూ.266కు బదులు రూ.350కు విక్రయిస్తునట్లు గుర్తించి రూ.20254 విలువైన 3.45 మెట్రిక్ టన్నుల యూరియాను సీజ్ చేశారు. దుకాణంపై 6ఎ కేసు నమోదు చేశారు. గణేష్ ట్రేడర్స్, వెంకటేశ్వర రైతుసేవా కేంద్రంలో తనిఖీలు చేసి అనుమతులు లేకుండా విక్రయిస్తున్న రూ.11,57276 విలువైన 49.6 మెట్రిక్ టన్నుల ఎరువులను అమ్మకాలను నిలిపేశారు. మరోవైపు అధికారుల తనిఖీల గురించి సమాచారం తెలుసుకున్న ▶ 2లో



ఎరువులను పరిశీలిస్తున్న అధికారులు

విద్యార్థుల హక్కులకు భంగం వాటిల్లితే పాఠశాలల గుర్తింపు రద్దు

- సెలవులను తప్పనిసరిగా అమలు చేయాల్సిందే
- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బి.పద్మావతి
- కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంతో సమావేశం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలలన్నీ సెలవులను తప్పనిసరిగా అమలు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బి.పద్మావతి స్పష్టం చేశారు. బాలల హక్కులు, చట్టాలపై పల్నాడు జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల యాజమాన్యంతో సమావేశం శుక్రవారం నిర్వహించారు. కలెక్టరేట్‌లోని స్పందన హాలులు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పద్మావతి మాట్లాడుతూ విద్యార్థుల హక్కులను ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల్లో ఉల్లంఘిస్తున్నట్లు కమిషన్ దృష్టికి వచ్చిందని చెప్పారు. ప్రతి ఆదివారం, ప్రతినెలా రెండో శనివారం, పండుగల సెలవులను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అమలు చేయాల్సిందేనన్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహించినట్లు ఎవరైనా తమకు దృష్టికి ఆధారాలు సహా తెచ్చే ఆ పాఠశాల గుర్తింపు రద్దుకు నివేదిస్తామని చెప్పారు. అన్ని పాఠశాలల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, అగ్ని మాపక యంత్రాలు ఉండాలని, విద్యార్థులతో క్రీడలు అడించాలని, వెలుతురు లేని ప్రాంతంలో తరగతులు నిర్వహించొద్దని, ▶ 2లో

ప్రతి పాఠశాలనూ సందర్శించాలి

అధికారులకు పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశం

2 లో



మాచర్లకు తిరిగి వచ్చిన చెన్నకేశవరావు

14 ఏళ్ల తర్వాత కుటుంబం చెంతకు

తప్పిపోయిన వ్యక్తిని చేరదీసి అప్పగించిన స్వచ్ఛంద సంస్థ

ప్రజాశక్తి - మాచర్ల

మతి స్థిమితం లేక ఇంటి నుండి వెళ్లిన యువకుడు 14 ఏళ్ల తర్వాత ఓ స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో కుటుంబం చెంతకు చేరాడు. మాచర్ల పట్టణంలో శుక్రవారం జరిగిన ఘటనపై వివరాల ప్రకారం.. స్థానికుడైన కొప్పుల వెంకటయ్య కూరగాయల మార్కెట్‌లో వ్యాపారం చేసే వాడు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమారుడు కొప్పుల చెన్నకేశవరావుకు మానసిక ఎదుగుదల తక్కువ. వెంకటయ్య ఆర్థికంగా చితికి పోవటం వలన 14 ఏళ్ల క్రితం భార్య, పిల్లలతో ఇక్కడ ఆస్తులను అమ్ముకొని హైదరాబాద్‌కు వెళ్లాడు. ఆదేరోజు వారి ▶ 2లో

ప్రతి పాఠశాలనూ సందర్శించాలి

అధికారులకు పల్నాడు కలెక్టర్ ఆదేశం



ప్రజాశక్తి - పల్నాడు జిల్లా: ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లను అధికారులు తప్పనిసరిగా తనిఖీ చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్‌లో ఆదేశించారు. ఈ అంశంపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం సమీక్షించారు. ప్రత్యేకాధికారులు తమ పరిధిలోని ప్రతి పాఠశాలనూ సందర్శించారా? విద్యార్థులతోపాటే భోజనం చేశారా? అని ప్రశ్నించారు. ఫోర్టిఫైడ్ బియ్యం సరైన సమయానికి అందుతున్నాయా? అని ఆరా తీశారు. వారంలో ఒకరోజు ఏదో ఒక పాఠశాలను సందర్శించాలని చెప్పారు. నెలలో ఒక వారంలో 10-19 ఏళ్ల వారికి రక్త హీనత పరీక్షలు నిర్వహించి లోపాలను గుర్తిస్తే మందులు, పౌష్టికాహారం ఇవ్వాలని చెప్పారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని, సదుపాయాలు కల్పించాలని అన్నారు. ఆదివారం లోగా ఇళ్ల పట్టాలిచ్చిన వారి రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు.

వాలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఖాళీగా ఉన్న 82 వార్డు వాలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో తెలిపారు.నేడు అన్ని వార్డు సచివాలయాల్లో ఖాళీల వివరాలు ప్రదర్శించటం జరుగుతుందన్నారు. వాలంటీరు పోస్టునకు దరఖాస్తుదారుడు 10వ తరగతిగానీ తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణులై ఆధార్ కార్డులోని పుట్టిన తేది,10 వ తరగతి సర్టిఫికేట్‌లోని పుట్టిన తేదీ ఒకటై ఉండాలన్నారు. 2023 జనవరి 31వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలని,35 సంవత్సరములు మించని వారై ఉండాలన్నారు. దరఖాస్తుదారుని ఆధార్ కార్డు చిరునామా నగరపాలక సంస్థ పరిధిలోనే ఉండాలన్నారు. ఫిబ్రవరి 6 నుండి 9 వరకు **http://40.81.241.107/APVOLUNTEER20/apVolunteer090420201049.vt** ఆన్‌లైన్ ద్వారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 10న ఆన్‌లైన్‌లో అందిన దఖాస్తులను పరిశీలించి, 14, 15 తేదీల్లో మౌఖిక పరీక్షలు నిర్వహించి ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన వారు 17 నుండి నుండి విధుల్లోకి చేరాల్సి ఉంటుందన్నారు.

బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిపై కేసు

ప్రజాశక్తి-తెనాలి: బాలికపై అత్యాచారం చేసిన యువకుడిపై పట్టణ ఒన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన ఓ మహిళ దాదాపు ఎనిమిదేళ్ళ క్రితం భర్తతో విబేధించి స్థానిక ఉప్పుబజారులో మరో వ్యక్తితో సహజీవనం చేస్తోంది. అమెకు 11 ఏళ్ళకుమార్తె ఉంది. ఆమె సహజీవనం చేస్తున్న వ్యక్తికి భార్య మరణించింది. అతనికి యుక్తవయసు కుమారుడు సతీష్‌చంద్ర ఉన్నాడు. వీరంతా ఒకే ఇంటిలో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో గతనెల్లో బాలిక తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతుండటంతో ఆమె తల్లి కొత్తపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాల్లో వైద్య పరీక్షలు చేయించింది. బాలిక ఏడు నెలల గర్భవతిగా తెలుసుకున్న ఆమె, అందుకు కారణాలను బాలిక ద్వారా తెలుసుకుంది. కొన్ని నెలలుగా సతీష్‌చంద్ర బాలికపై అత్యాచారం చేస్తున్నట్లు తెలుసుకున్న ఆమె వైద్యుల సూచన మేరకు జిల్లా సమగ్ర వైద్యశాలను సంప్రదించటంతో, వారు పోలీసులకు సమాచారమిచ్చారు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఫోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు.

లైంగిక దాడి కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి-తెనాలి: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిని త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ యు.శ్రీనివాసులు వెల్లడించిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన బాలిక ఇంటర్ చదువుతోంది. ఆమె అక్క కూడా బిటెక్ రెండో సంవత్సరం చదువుతోంది. అక్కతో పాటు చదువుతున్న కోటప్పకొండకు చెందిన సాయి లక్ష్మినారాయణ ఇంటర్ చదువుతున్న బాలికతో పరిచయం పెంచుకుని ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక ద్వారా విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించటంతో కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేసి శుక్రవారం కోర్టుకు హాజరుపరిచారు.

6న కలెక్టరేట్ వద్ద ధర్నా

- జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు రూ.5లక్షలు ఇవ్వాలి
- టిడ్కో గృహాలను వెంటనే పంపిణీ చేయాలి
- అఖిలపక్షం రౌండ్‌టేబుల్ సమావేశంలక్ష వక్తల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి -వినుకొండ

జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారులకు నిర్మాణ వ్యయం రూ.ఐదు లక్షలు ఇవ్వాలని, రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న టిడ్కో గృహాలను మౌలిక వసతులు ఏర్పాటు చేసి వెంటనే పంపిణీ చేయాలని అఖిలపక్షం నేతలు డిమాండ్ చేశారు. పట్టణంలోని శివయ్య భవన్లో శుక్రవారం అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం బూదాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అఖిలపక్ష నేతలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలన్నారు. జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు సెంటు చొప్పున ఇంటి స్థలం ఇచ్చి, నిర్మాణ వ్యయం రూ. 1.80 లక్షలు ఇవ్వడం సరికాదన్నారు. ఆ సోమ్ము ఇంటి బేస్‌మట్టం వరకు మాత్రమే వస్తుందన్నారు. పెరిగిన వ్యయానికి అనుగుణంగా లబ్ధిదారునకు రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇల్లు కట్టుకోలేని లబ్ధిదారులను ప్రభుత్వ అధికారులు తీవ్ర ఒత్తిళ్లకు గురి చేస్తున్నారని, నిర్మాణం చేపట్టకపోతే లిస్టులో నుంచి తొలగిస్తామని బెదిరింపులు సరికాదన్నారు. 90 శాతం పైబడి నిర్మించబడిన టిడ్కో గహాలను మౌలిక వసతులు ఏర్పాటు చేసి వెంటనే పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పై డిమాండ్ల సాధన కొరకు పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఫిబ్రవరి 6 సోమవారం నాడు జరిగే ధర్నాలో అన్ని రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని వారు కోరారు. సమావేశంలో అఖిలపక్ష నాయకులు ఏ. మారుతి వరప్రసాద్, టిడిపి నాయకులు పి.వి. సురేష్, సిపిఎం నాయకులు బొంకూరు వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్కే నాయుడు, ఉలవలపూడి రాము, జనసేన నాయకులు శ్రీను, నాయకులు ప్రసన్న కుమార్, మాల మహానాడు నాయకులు పిడుగు విజయ్, పఠాన్ లాల్ ఖాన్, పిన్నిబోయిన వెంకటేశ్వర్లు, సిపిఎం నాయకులు మదార్ వలి, సిపిఐ నాయకులు ఆర్. వందనం, ఎ. పవన్ కుమార్, బి. సాగర్, షేక్ మస్తాన్, నూలి పుల్లయ్య,ెక. మల్లికార్జున,జె. వెంకటేశ్వర్లు, నల్లబోతు శ్రీను పాల్గొన్నారు.

అధిక ధరలకు యూరియా విక్రయం

(మొదటి పేజీ తరువాయి)

పలువురు వ్యాపారులు తమ దుకాణాలను మూసేశారు. తనిఖీల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీహరి, టి.లక్ష్మారెడ్డి, విజిలెన్స్ వ్యవసాయ అధికారి జె.వాసంతి, ఎఫ్ఆర్‌ఒ సైదులు, సత్తెనపల్లి ఇన్‌ఛార్జి ఎడిఎ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలల గుర్తింపు రద్దు

(మొదటి పేజీ తరువాయి)

మరుగుదొడ్ల పరిశుభ్రత పాటించాలని, పిల్లల్లో మానసిక పరిపక్వత కోసం సైకాలజిస్టులను నియమించాలని చెప్పారు. ఈ అంశాలపై పర్యవేక్షణకు జిల్లా విద్యాశాఖాధికారులకు ఇప్పటికే ఆదేశాలిచ్చామన్నారు. పిల్లల హక్కుల భంగం కలిగితే 1098 చైల్డ్ లైన్‌కు గానీ, apscpcr2018@gmail.comకు గానీ ఫిర్యాదు చేసేలా ప్రతి పాఠశాలలో నోటీసు బోర్డులో ఉంచాలని చెప్పారు. సమావేశంలో డిఇఒ ఎం.వెంకటప్పయ్య, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా పీడీ అరుణ, సిడిపిఒ రేవతి పాల్గొన్నారు.

14 ఏళ్ల తర్వాత కుటుంబం చెంతకు

(మొదటి పేజీ తరువాయి)

కుమారుడు చెన్నకేశవరావు కనిపించకుండా పోయాడు. ఏళ్ల తరబడి వెదికినా ఫలితం లేకపోయింది. అయితే చెన్నకేశవరావును ఓ స్వచ్ఛంద సేవా సంస్థ చేరదీసి ముంబాయిలో ఆశ్రయం కల్పించింది. చెన్నకేశవరావు మానసిక పరిస్థితి కొంత మెరుగుపడటంతో తమ సొంతూరు మాచర్ల అని, తండ్రి కూరగాయాల వ్యాపారం అని చెప్పటంతో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు చెన్నకేశవరావును ముంబాయి నుండి మాచర్లకు తెచ్చారు. కూరగాయాల మార్కెట్ వద్ద ఆరా తీయగా, ఇప్పటికి వ్యాపారం చేస్తున్న చెన్నకేశవరావు బంధువులు చెన్నకేశవరావును గుర్తు పట్టి స్వచ్ఛంద సంస్థ వారికి వారి కుటుంబ విషయాలు తెలియజేశారు. చెన్నకేశవరావు కూడా బాబాయ్‌ని, బంధువులను గుర్తించటంతో చెన్నకేశవరావుని వారికి అప్పగించారు. ఇతర జిల్లాలకు చెందిన మరో నలుగురు ఉన్నారని, వారినీ వారి కుటుంబాల వద్దకు చేర్చలాని స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు చెప్పి వెళ్లిపోయారు. చెన్నకేశవరావు తండ్రి ఏడాది క్రితం చనిపోవడం, తల్లి, తమ్ముడు హైదరాబాద్‌లో ఉండగా వారిని సంప్రదించడంతో వాహనంలో హైదరాబాద్‌కు పంపాలనే కోరిక మేరకు పంపుతున్నామని బంధువు సైదయ్య తెలిపారు.



రచ్చబండలో మాట్లాడుతున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

సంపన్న వర్గాల అభ్యున్నతికే బడ్జెట్

ప్రజాశక్తి- కొల్లిపర

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ సంపన్న వర్గాల అభ్యున్నతికి వేసిన బడ్జెట్ అని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పిడపర్తి పాలెం గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ బడ్జెట్లో వ్యవసాయ రంగ అభివృద్ధికి నిధులుకేటాయించపోవడం దురదృష్ట కరం అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి బడ్జెట్లో నిధులు రాబట్టుకోకపోవడం రాష్ట్ర ప్రభుత్వ దౌర్భాగ్యం అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు భీమవరపు చిన కోటిరెడ్డి, వంగాసామిరెడ్డి , జి. గోవర్ధన్ రెడ్డి, వీరారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జగన్ వల్లే కేంద్ర బడ్జెట్‌లో రాష్టానికి మొండి చేయి

ప్రజాశక్తి - తుళ్లూరు

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మెతక వైఖరి వల్లే బడ్జెట్ లో కేంద్రం రాష్ట్రానికి మొండి చేయి చూపిందని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకా విజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని దొండపాడులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో హత్‌సేహత్ జోడో కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర జరిగింది. ప్రత్యేక హెూదా, పోలవరం కడప స్టీల్ ప్లాంట్, అమరావతి రాజధాని తదితర నిర్మాణాలకు బడ్జెట్లో నిధులు కేటాయించక పోవడం దారుణమన్నారు.కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాల ప్రజల ను తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు .ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. అమరావతి నగర అధ్యక్షులు కె. సురేష్ బాబు, ఎ.శ్రీనివాస రావు, వి.కొటేశ్వరరావు, షేక్ లియాఖత్ అలీ పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రోత్సాహభామతులు

ప్రజాశక్తి - అచ్చంపేట : రిపబ్లిక్ డే సందర్భంగా రాజ్యాంగంపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులను దళిత బహుజన రిసోర్సెస్ సెంటర్ (డిబిఆర్‌సి) ఆధ్వర్యంలో శుక్రవారం ప్రదానం చేశారు. మండల కో-ఆర్డినేటర్ అశోక్ మాట్లాడుతూ అచ్చంపేట కస్తూర్బా గాంధీ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో పోటీలు నిర్వహించామని, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారని చెప్పారు. ఉమ్మడి గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప మాట్లాడుతూ క్విజ్ పోటీలను ఏర్పాటు చేసి వారిలో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, పాఠశాలకు బెస్ట్ అవార్డుగా ఉపాధ్యాయుల సిబ్బందికి అందించామన్నారు. కార్యక్రమంలో డిబిఆర్‌సి డైరెక్టర్ అల్లడి దేవకుమార్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లాలో 21 మందికి విదేశీ విద్యాదీవెన

ప్రజాశక్తి-గుంటూరు

పేద విద్యార్థులు ప్రపంచంలోనే అత్యున్నత యూనివర్సిటీలలో ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం కల్పించే లక్ష్యంతో జగన్మోహన్‌రెడ్డి, విద్యా దీవెన పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నారని ఎమ్మెల్సీ, ప్రభుత్వవిప్ డొక్కా మాణిక్యవరప్రసాద అన్నారు.శుక్రవారం తాడేపల్లిలోని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి విదేశీ విద్యా దీవెన పథకాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్చువల్‌గా ప్రారంభించారు.గుంటూరు కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్యవరప్రసాదరావు, కలెక్టర్ యం.వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు చైర్మన్ మందపాటి శేషగిరిరావు పాల్గొన్నారు. జిల్లాలో జగనన్న విదేశీ విద్యా దీవెన పథకానికి అర్హత పొందిన 21 మంది విద్యార్థులకు మంజూరు చేసిన మొదటి విడత ఆర్థిక సహాయం రూ.1,21,01,304లు చెక్కును లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా డొక్కా మాణిక్యవరప్రసాదరావు మాట్లాడుతూ ఈ పథకం ద్వారా జిల్లాలో 21 మంది విద్యార్థులు విదేశాలలో విద్యను అభ్యశిస్తున్నారన అన్నారు. ఈ పథకానికి అర్హత సాధించేందుకు గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు విస్తతంగా అవగాహన, శిక్షణ అందించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంవత్సర ఆదాయం రూ.8లక్షల లోపు ఉండి, 35 సంవత్సరాల లోపు ఉన్న వారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర శాలివాహన, కుమ్మరి కార్పోరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, రాష్ట్ర కష్ణ బలిజ పూసల కార్పోరేషన్ చైర్ పర్సన్ కోలా భవానీ మణికంఠ, రాష్ట్ర ఎన్ఆర్‌ఈడీసీ డైరక్టర్ కొత్త చిన్నపరెడ్డి, జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

పలు కేసుల్లో నిందితులు అరెస్టు

వివరాలు వెల్లడించిన సిఐ పి.శేషగిరిరావు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

మండలంలోని వివిధ నేరాలలో నిందితులుగా ఉన్న వారిని తాడేపల్లి పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం నిందితుల వివరాలను సిఐ. పి.శేషగిరిరావు వెల్లడించారు. ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి గ్రామానికి చెందిన పులగం భాస్కరరెడ్డికి చెందిన లారీని తన డ్రైవర్ అర్ధరాత్రి సమయంలో తాడేపల్లి టౌన్ లోని పాత టోల్గేట్ సెంటర్లో పార్క్ చేసి బయటకు వెళ్లే క్రమంలో నిందితుడు వల్లేపు హరికృష్ణ అతని అనుచరుడు కృష్ణాజిల్లా, ఇబ్రహీంపట్నంకి చెందిన శ్రీనివాస్‌తో కలిసి పార్కు చేసిన లారీని చోరీ చేశారు. అనంతరం చోరీ చేసిన లారీని స్పేర్ పార్ట్స్ రూపంలో అమ్మడానికి సదరు లారీని తరలిస్తుండగా తాడేపల్లి పోలీసులు అరెస్టు చేశారు. అదేవిధంగా మండలంలోని వడ్డేశ్వరం గ్రామానికి చెందిన ఇసుకపల్లి సాధవి (19), గత నెల జనవరి 14వ తేదీన ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో ఆమెను కుటుంబ సభ్యులైన ముగ్గురు శారీరకంగా, మానసికంగా వేధించి భరించలేని బాధలు పెట్టి ఒత్తిడికి గురి చేశారు. మనస్థాపానికి గురైన సాధవి ఒంటికి నిప్పంటించుకొని తీవ్ర గాయాల పాలై జనవరి 19వ తేదీన విజయవాడ గవర్నమెంట్ హాస్పిటల్‌లో మృతి చెందింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఇసుకపల్లి జోజి బాబు, ఇసుకపల్లి మేరీ, ఇసుకపల్లి తంబిలను తాడేపల్లి పోలీసులు అరెస్టు చేశారు. అదేవిధంగా వడ్డేశ్వరం గ్రామంలో గల స్టాంజా లివింగ్ హాస్టల్‌లో కేఎల్‌యు కి చెందిన ఇరువురి విద్యార్థుల రెండు ల్యాప్‌ట్యాప్‌ల చోరీ కేసులో నిందితులైన కాకినాడకు చెందిన తేతెల్ల శరన్ భగవాన్ రెడ్డిని అరెస్టు చేసి రెండు లాప్టాప్‌లను, కెనాన్ కెమెరాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు పంపించారు. త్వరిత గతిన కేసులను ఛేదించిన తాడేపల్లి ఎస్ఐ డి వినోద్, ఎస్ఐ డి. రమేష్, ఎస్ ఐ ఆర్ నారాయణ లను స్టేషన్ సిబ్బందితో, ఐటీకోర్‌టీం సహాయంతో కలసి దర్యాప్తు చేపట్టి, నిందితులను అరెస్టు చేసినందుకు సిఐ శేషగిరిరావు అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ శేషగిరిరావు



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, తదితరులు

కుష్టువ్యాధి నివారణపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి- కొల్లిపర

కుష్టు వ్యాధి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కొత్తపల్లి బాబురావు అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ఈ నెల 13వ తేదీ వరకు కుష్టు వ్యాధి పక్షోత్సవ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ ర్యాలీల ద్వారా వ్యాధిగ్రస్తులను గుర్తించవచ్చు అని శరీరంపై ఎర్రని రాగి వర్ణం మచ్చలు కలిగి స్పర్శ లేనట్లయితే వెంటనే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. వ్యాధి నిర్ధారైనట్లయితే ఉచితంగా మందులు అందజేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల లెప్రసీనోడల అధికారి అందే బాలచంద్రమౌళి, జంగం శ్యామ్, దాసరి స్వరూపారాణి, వంగర బుచ్చిబాబు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుదాఘాతంతో మహిళకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-నూజండ్ల

కరెంట్ షాక్ తగిలి మహి ళకు తీవ్రగాయాలైన సంఘటన నూజెండ్లలో శుక్రవారం చోటు చేసుకంది. గ్రామానికి చెందిన కాటం రత్తాలు పొలం పనులు ముగించుకోని ఇంటి వచ్చే క్రమంలో గడ్డికోసుకోని మూటను తలపై పెట్టుకుంది. దారి మధ్యలో కిందకు వేలాడుతున్న విద్యుత్ వైరల్ గడ్డిమోపుకు తగిలి విద్యుద్ఘాతానికి గురైంది. గమనించి గ్రామస్తులు తీవ్రగాయాలైన రత్తాలును వైద్య చికిత్సల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి : ఎమ్మెల్యే

అలవాల ఘటనలో టిడిపి ఆరోపణలకు ఖండన

ప్రజాశక్తి -నరసరావుపేట:



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల మండలం అలవాల గ్రామంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు వెన్నా బాలకోటిరెడ్డిపై జరిగిన కాల్పుల ఘటనలో టిడిపి నాయకులు అసత్య ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూపమ్మి వెంకటేశ్వర రెడ్డి అనే వ్యక్తి టిడిపి చెందిన వారని అందరికి తెలుసుఅని అనవసరంగా వైసిపి నేతలపై ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు.అతనిని ఘటన జరిగిన తర్వాత టిడిపి నుండి సస్పెండ్ చేసినట్లు టిడిపి నాయకులు తెలపడం ఎమిటని ప్రశ్నించారు. బాధితుడి భార్య టిడిపిలో విభేదాల కారణంగానే తన భర్త పై దాడి జరిగిందని ఒప్పుకుందని దాడికి గురైన బాలకోటి రెడ్డి సైతం ఒప్పుకున్నాడని పేర్కొన్నారు. ఘటన జరిగిన 4 గంటలలోనే నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారని తెలిపారు. మొదటి సారి దాడి చేసినప్పుడే పార్టీ విభేదాలను సరిదిద్దే ప్రయత్నంలో డాక్టర్ చదలవాడ వైఫల్యం చెందారన్నారు.

టిడ్కో ఇళ్ల పట్టాలు అందజేత

ప్రజాశక్తి - మంగళగిరి

నగరంలోని ఎంటీఎంసీ కార్యాలయంలో అర్హులైన 22మంది టిడ్కో గృహ లబ్ధిదారులకు శుక్రవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుల చేతుల మీదుగా మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంకేతిక కారణాల వల్ల ఇళ్ల పట్టాల మంజూరులో జాప్యం జరిగిందని, అధికారులు వాటిని పరిష్కరించడంతో లబ్ధిదారులకు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ యు. శారదాదేవి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి హ్యాపీ హాస్పిటల్‌లో పాప్‌స్మియర్ పరీక్షలు

ప్రజాశక్తి -తెనాలి

స్థానిక పాత ప్రభుత్వ వైద్యశాల ఎదురు రోడ్డులోని హ్యాపీ హాస్పిటల్‌లో శనివారం నుంచి ప్రతి రోజూ మహిళలకు ఉచితంగా పాప్ స్మియర్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు వైద్యశాల అధినేత డాక్టర్ పవని ప్రియాంక శుక్రవారం తెలిపారు. అలాగే ప్రతి శుక్రవారం ఆంకాలజి (క్యాన్సర్) కన్సల్టెంట్ అందుబాటులో ఉంటారని, క్యాన్సర్, దాని నియంత్రణకు వ్యాక్సిన్ పై అవగాహన కల్పిస్తారని పట్టణ పరిసర ప్రాంత ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాల్సిందిగా ఆమె కోరారు.

గూడ్స్ రైలుకు అగ్నిప్రమాదం

ప్రజాశక్తి -దుగ్గిరాల



విజయవాడ నుండి తెనాలి వైపు కంకరలోడుతో వెళ్తున్న గూడ్స్ రైలు దుగ్గిరాల రైల్వే స్టేషన్‌లో అగ్ని ప్రమా దానికి గురైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గూడ్స్ రైలు ఇనుప చక్రం బేరింగ్ వద్ద మంటలు రావడం గమనించిన స్టేషన్ మాస్టర్ వెంటనే డ్రైవర్‌కు సమాచారం అందించారు. డ్రైవర్ బండిని నిలిపి వేశారు. స్టేషన్లో ఉన్న అగ్నిమాపక సిలిండర్‌లతో మంటలను ఆర్పివేశారు. స్టేషన్లో సంఘటన వలన రైళ్ల రాకపోకలకు ఎటువంటి అంత రాయం కలగలేదు. లూప్ లైన్ ద్వారా రైలుబళ్లను నడిపారు.



హెల్మెట్ ధారణపై అవగాహన

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణం చింతలపూడిలో జాతీయ రహదారి భద్రతా ఉత్సవాల్లో భాగంగా ఎస్ఐ భార్గవ్ ఆధ్వర్యంలో హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్ఐ . భార్గవ్ మాట్లాడుతూ హెల్మెట్ లేకపోవడం వలన దురదృష్టవశాత్తు ప్రమాదాల బారిన పడినా, హెల్మెట్ ధరిస్తే ప్రాణాన్ని కాపాడుకునే అవకాశముందని అన్నారు.

కాల్వలో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి- దుగ్గిరాల : కృష్ణ పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ బకింగ్ హాంగ్ కెనాల్‌లో తుమ్మపూడి గ్రామ సమీపంలో గుర్తు తెలియని పురుషుని మృతదేహం ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. మృతదేహం బాగా డీకంపోస్ అయి ఉన్నదని వాళ్ల తెలిపారు. కాలువ గట్టు పక్కన పొదల్లో ఇరుక్కొని ఉందని, చీకటి పడటం వలన మృతదేహం వద్దకు వెళ్లలేక వివరాలు సేకరించలేకపోయా మని తెలిపారు.



మిర్చి నిల్వలు

		బ్యాగులు
మిర్చి దిగుమతి	:	75,359
మిర్చి ఎగుమతి	:	88,665
మిర్చి నిల్వ	:	60,138

మిర్చి ధరలు

	రూపాయలలో
334	7500- 23000
నెం.5	13000 - 20000
273	14500 - 19000
341	8000 - 22500
4884	13000 - 18000
సూపర్-10	9500 - 19500
నాన్ ఎసి	
తేజ	8000 - 19500
బడిగి	12000 - 25000
దేవనూరు డీలక్స్	8000 - 21000
తాలుకాయలు	4,500 - 12,000

ఘనంగా సాయిబాబా మందిరం 17వ వార్షికోత్సవం



జెడీ లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

పట్టణంలో షిరిడి సాయిబాబా మందిరం 17వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం మాజీ సిబిఐ జేడీ లక్ష్మీనారాయణ, యు బ్లడ్ ఫౌండర్ ఎలమంచిలి జగదీష్ బాబు, రమేష్ బాబు, కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అన్నాభిషేకం నిర్వహించారు. అనంతరం వేల సంఖ్యలో వచ్చిన యాత్రికులకు స్వామివారి దర్శనం కల్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శైవ క్షేత్ర పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ శివ స్వామి, మాజి మంత్రివర్యులు కన్నా లక్ష్మీనారాయణ, పుల్లారావు , ఆనంద్ బాబు ,ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ , అనురాధ ,మాజీ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, కొమ్మాలపాటి శ్రీధర్, చింతమనేని ప్రభాకర్ , గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ సిసోడియా, శ్రీ కన్నా బాబు ఐఏఎస్ దంపతులు, సూర్య ప్రకాష్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ నాయుడు పాటిబండ్ల రామకృష్ణ , లంక దినకర్ , నాగేంద్ర, రామినేని ఫౌండేషన్ చైర్మన్ ధర్మ ప్రచారఖ్, బ్రాండిక్స్ అధినేత దొరై స్వామి, గంజి చిరంజీవి, చిల్లపల్లి శ్రీనివాసరావులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసిన యాత్రికులకు ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి నాగభూషణం ధన్యవాదాలు తెలియజేశారు.

Notice

IN THE COURT OF THE HON'BLE IV ADDL.DIST. JUDGE:GUNTUR

M.V.O.P.No: 306 / 2020

Between:
Challa Aruna Kumari and Others ...**Petitioners**

And

Battula Rama Krishna & Others ...**Respondents**

To,
R-2: Sri Bathula John Paul,
S/o. GovinduluR/o.Vinukonda Road,
Karempudi(Vil&Md), Guntur Dist.
(Driver of Lorry bearing No: AP 16 TY 4859)

పై నెంబరు O.Pలోని పిటీషనర్లు యాక్సిడెంటుకు నష్టపరిహారము కోరుచూ పిటీషన్ దాఖలు చేయగా సదరు పిటీషన్ లో 2వ రెస్పాండెంట్ అయిన మీరు కోర్టు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ వార్త పత్రిక ద్వారా మీకు తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది: 20-02-2023 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ.గం. 10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హజరై మీకు గల అక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది:20-02-2023

పసుపులేటి శ్రీనివాస రావు,
తోట శ్రీనివాస రావు,
పిటీషనర్లు తరపు అడ్వకేట్స్,
కొరిటెపాడు, గుంటూరు,
సెల్:9052432323,9848461613




మాట్లాడుతున్న గోపాలరావు, విజయ్‌కుమార్

వ్యవసాయానికి, రాష్ట్రానికి అన్యాయం

- సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్
- కేంద్ర బడ్జెట్‌పై వామపక్షాలు, ప్రజాసంఘాల అసంతృప్తి
- రైతు, కౌలురైతు సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - నరసరావుపేట

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ కోతల బడ్జెట్ అని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ విమర్శించారు. దేశంలో 60-70 శాతం జనాభా ఆధారపడిన వ్యవసాయ రంగానికి 50 శాతం కోత విధించారని మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్‌పై స్థానిక పల్నాడు విజ్ఞాన కేంద్రంలో రౌంట్ టేబుల్ సమావేశం రైతు, కౌలురైతు సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.రామారావు అధ్యక్షత వహించగా వామపక్ష పార్టీలు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగినా బడ్జెట్ బాగుందంటూ రాష్ట్ర ఆర్థిక మంత్రి వ్యాఖ్యానించారని, పైగా వారి సూచనలు, సలహాలను పరిగణలోకి తీసుకున్నారని చెప్పారని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం, ప్రాజెక్టు పూర్తికి నిధుల బాధ్యతను కేంద్రం విస్మరించిందని, విశాఖ రైల్వే జోన్, కడపు ఉక్కు ఫ్యాక్టరీ అందని ద్రాక్షగానే ఉందని చెప్పారు. పల్నాడు ప్రాంతంలోని నడికుడి శ్రీకాళహస్తి రైల్వేలైన్ 50 శాతమే పూర్తయ్యిందని, మిగతావి ఎప్పుడు పూర్తి చేస్తారని ప్రశ్నించారు. ప్రత్యేక హోదాపై కేంద్రాన్ని అడిగే ధైర్యం రాష్ట్ర ప్రభుత్వం చేయడం లేదన్నారు. ఈ అంశాలపై ప్రజలోల చైతన్యం తెస్తామని చెప్పారు.సిపిఐ ఏరియా సహాయ కార్యదర్శి కె.రాంబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు చెప్పినదాని ప్రకారమే 15 కోట్లకు పైగా నిరుద్యోగులున్నారని, వీరికి ఉపాధి కల్పనపై బడ్జెట్లో సరైన చర్యలేమీ లేవని విమర్శించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామనే హామీపై మోడీ మరోసారి మోసం చేశారని మండిపడ్డారు. రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి వై.గోపాలరావు మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు పన్నులు తగ్గించి సామాన్యులపై భారం వేసినా బడ్జెట్ ప్రజామోదం పొందుతుందని జనసేన అధినేత పవన్ వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. ఆహార ఉత్పత్తులపై జీఎస్టీని ఎత్తేయాలని దేశవ్యాప్తంగా ప్రజలు గగ్గోలు పెడుతున్నా కేంద్రం పెడచెవిన పెట్టిందని విమర్శించారు. సహకార సంఘాల వద్ద ఉన్న రూ.2 లక్షల కోట్ల ఆదాయాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి బిల్లు పెట్టిందని అన్నారు. ప్రైవేటు కంపెనీలను బాగుచేయడానికే పంటల బీమా మినహా రైతుల కోసం కాదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ వంద రోజులు పనికి వేతనాలు చెల్లించాలంటే రూ.2 లక్షల కోట్లు అవసరమని, అయితే దానిలోనూ కోతలు పెట్టారని అన్నారు. వ్యవసాయాన్ని దెబ్బతీసే విధానాలకు వ్యతిరేకంగా, కార్మికుల హక్కుల కోసం ఏప్రిల్ 5 ఢిల్లీలో జరిగే భారీ ప్రదర్శనకు కార్మిక, కర్షకులు తరలిరావాలన్నారు. సమావేశంలో పల్నాడు విజ్ఞాన కేంద్రం కన్వీనర్ షేక్ మస్తాన్‌వలి, వివిధ సంఘాలు, పార్టీల నాయకులు డి.శివకుమారి, జి.బాలకృష్ణ, సిలార్ మసూద్, శ్యామ్, మణికంఠేశ్వర్, కృష్ణ, కె.ఏడుకొండలు, ఖాదర్ వలి, జిలాని మాలిక్, వెంకటకృష్ణ, సుభాష్ చంద్రబోస్, రామకృష్ణ, హుస్సేన్, బి.నాగేశ్వరరావు, కె.ఆంజనేయులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీని జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - నరసరావుపేట



కేంద్ర బడ్జెట్లో వివిధ రంగాలకు నిధులను కుదించిన కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా, రూ.26 వేల కనీస వేతనం, ఇతర సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీని అన్ని రంగాల కార్మికులు జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కోశాధికారి డి.శివకుమారి కోరారు. సిఐటియు జిల్లా కార్యవర్గ సమావేశం స్థానిక పల్నాడు విజ్ఞాన కేంద్రంలో గురువారం నిర్వహించారు. సమావేశానికి సిఐటియు పల్నాడు జిల్లా కె.హనుమంత్‌రెడ్డి అధ్యక్షత వహించారు. శివకుమారి మాట్లాడుతూమహిళా శిశు సంక్షేమ శాఖకు రూ.15 వేల కోట్లకు పైగా కుదించారని, స్కీమ్ వర్కర్ల సమస్యలను పట్టించుకోలేదని చెప్పారు. హనుమంతరెడ్డి మాట్లాడుతూ పౌరసరఫరా వ్యవస్థకు రూ.10 వేల కోట్లను తగ్గించిన కేంద్రం నాణ్యమైన ఆహార ఉత్పత్తులు ఎలా పంపిణీ చేస్తుందని ప్రశ్నించారు. పల్నాడు ప్రాంతానికి కీలకమైన వరికపూడిశెల ప్రాజెక్టు ఊసే లేదన్నారు. ధరలు పెరిగి, వేతనాలు చాలక కార్మికులు అల్లాడుతున్నారని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీలో అన్ని రంగాల కార్మికులు, స్కీమ్ వర్కర్లు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు గుంటూరు విజయకుమార్, పి.శ్రీనివాసరావు, షేక్ బందగి సాహెబ్, సిలార్ మసూద్, జి.మల్లేశ్వరి, ప్రసన్న, జి.రవిబాబు, పి.వెంకటేశ్వర్లు, టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూసేకరణను మూణ్ణెల్లలో పూర్తి చేయాలి : జెసి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్



రహదారి విస్తరణ లేఅవుట్ ను పరిశీలిస్తున్న జెసి

జాతీయ రహదారి విస్తరణకు అవసరమైన భూసేకరణను మూడు నెలల్లో పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. సత్తెనపల్లి, ముప్పాళ్ల, రాజుపాలెం, బెల్లంకొండ మండలాల్లో రోడ్డు విస్తరణ కోసం సర్వే చేసిన పొలాలను జెసి శుక్రవారం పరిశీలించారు. పేరేచర్ల నుండి కొండమోడు వరకు 49.9 కిలోమీటర్లు సుమారు రూ.900 కోట్లతో జాతీయ రహదారి 167ఎజీ విస్తరణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో రహదారి విస్తరణకు అవసరమైన భూసేకరణను జెసి పరిశీలించారు. సత్తెనపల్లి, ముప్పాళ్ల మండలాల్లో బైపాస్ రహదారి విస్తరణకు సర్వే చేసిన పొలాలుకు సంబంధించిన లే అవుట్‌ను జాయింట్ కలెక్టర్ పరిశీలించి అధికారులతో సమీక్షించారు. రహదారి విస్తరణకు పల్నాడు జిల్లాలో 437.5 ఎకరాలను సేకరించనునట్లు చెప్పారు. కార్యక్రమంలో ముప్పాళ్ల, సత్తెనపల్లి తహశీల్దార్లు భవానీ శంకర్, కె.నగేష్, జిల్లా ల్యాండ్ సర్వే ఏడీ నాగకుమార్, జాతీయ రహదారి ఎఇ ప్రకాశం, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల జీవితాల్లో దుమ్ముకొట్టిన కేంద్రం

రూ.200 కోట్లే కేటాయింపు తీవ్ర అన్యాయం

ఏపీ చేనేత కార్మిక సంఘం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

కేంద్ర బడ్జెట్‌లో చేనేత రంగానికి రూ.200 కోట్లు మాత్రమే కేటాయించి చేనేత కార్మికుల జీవితాల్లో కేంద్ర ప్రభుత్వం దుమ్ము కొట్టిందని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శివదుర్గారావు, ఎ.వీరబ్రహ్మం విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన జారీ చేశారు. వ్యవసాయ రంగం తర్వాత ఎక్కువ మందికి జీవనాధారమైన చేనేత రంగాన్ని విస్మరించడం, టెక్స్‌టైల్స్ రంగానికి మాత్రం రూ.53,000 కోట్లు కేటాయించడం దారుణమని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉండగా చేనేత రంగానికి ఏడాదికి రూ.3600 కోట్లు కేటాయించిందని, దాన్ని రూ.5 వేల కోట్లు చేస్తామని హామీనిచ్చిన బిజెపి మొత్తం ఎనిమిదేళ్లలోనూ రూ.5 వేల కోట్లు కేటాయించలేదని విమర్శించారు. పైగా జీఎస్టీ విధించారని గుర్తు చేశారు. మాటల్లో ప్రగల్భాలు పలుకుతూ మరోవైపు చేనేత రంగాన్నే నాశనం చేయడానికి మోడీ పూనుకున్నారని దుయ్యబట్టారు. ఈ విధానాలపై చేనేత కార్మికులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

టార్గెట్‌బాల్ వర్సిటీ జట్టుకు ధనలక్ష్మి విద్యార్థులు

ప్రజాశక్తి - ఈపూరు




ఎల్.శ్రీకాంత్ రెడ్డి, భానుప్రకాష్

ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో ఇటీవల నిర్వహించిన టార్గెట్ బాల్ పోటీల్లో మండలంలోని ఎ.ముప్పాళ్ల ధనలక్ష్మి వ్యాయామ కళాశాల విద్యార్థులు ఎల్.శ్రీకాంత్‌రెడ్డి, కె.భానుప్రకాష్ ప్రతిభ చూపి వర్సిటీ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ చుండు వెంకటరావు శుక్రవారం తెలిపారు. ఎంపికైన వారు ఈ నెల 8,9వ తేదీల్లో విశాఖపట్నంలోని గీతమ్స్ యూనివర్సిటీలో నిర్వహించే అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొటారని తెలిపారు. వీరిని కళాశాల కరస్పాండెంట్, సెక్రెటరీ ఎం.రామశేషగిరిరావు, అధ్యాపకులు వై.సురేష్, ఆర్.బలరాం నాయక్, ఎం.సురేష్ కుమార్, ఎం.దాసు అభినందించారు.

ఎపిఆర్‌జెసి ప్రిన్సిపాల్‌గా రంగాచారి

ప్రజాశక్తి - విజయపురిసౌత్



నాగార్జున సాగర్ ఏపీఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జి.రంగాచారి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు పని చేసిన చందూ ఆంజనేయులు కామర్స్ అధ్యాపకులుగా విధులు నిర్వహించనున్నారు. నూతన ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన రంగాచారికి అధ్యాపకులు, సిబ్బంది శుభాకాంఓలు తెలిపి సత్కరించారు.



చౌక్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంఎజి విద్యార్థినులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఎంఎంజికి చెందిన మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థినులు జాతీయ స్థాయి చౌక్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ కుమార్ మహంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ చౌక్‌బాల్ అ సోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో తమ కాలేజీకి చెందిన డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థినులు ఎం.హదస్స, టి.జ్యోతిర్మయి, టి.అంజలి ప్రతిభ చూపారని తెలిపారుజ హైదరాబాద్‌లో శని, ఆదివారాల్లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు వీరు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఎంపికైన వారిని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.లావణ్య, అధ్యాపకులు అభినందించారు.

పెదకూరపాడు వైస్ ఎంపిపిగా బాలమేరి

ప్రజాశక్తి - పెదకూరపాడు



పెదకూరపాడు మండల వైస్ ఎంపిపి ఎన్నిక శుక్రవారం నిర్వహించగా కె.బాలమేరి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ ఆఫీసర్ వరప్రసాదరావు తెలిపారు. ఇప్పటి వరకూ వైస్ ఎంపిపిగా ఉన్న మీరయ్య ఎంపిపిగా ఎన్నికవడంతో వైఎస్ ఎంపిపి స్థానానికి తాజాగా ఎన్నికలు నిర్వహించారు. దీనికి లింగంగుంట్ల ఎంపిటిసి అయిన బాలమేరి ఎన్నికయ్యారు. మండలంలో 14 మంది ఎంపిటిసిలు ఉండగా ఎన్నిక కోసం నిర్వహించిన సమావేశానికి 12 మంది హాజరయ్యారు. ఒకరు గైర్హాజరయ్యారు. మరొకరు గతంలో రాజీనామా చేశారు.

విద్యార్థినులను పాఠశాలకు పంపించండి

తల్లిదండ్రులకు గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయ కర్త విజ్ఞప్తి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

గురుకుల పాఠశాలలో వసతులు మెరుగు పరుస్తున్నామని, విద్యార్థినులు తరగతులకు హాజరు కావాలని గురుకుల పాఠశాల గుంటూరు జిల్లా సమన్వయకర్త శాంతి విశాల శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని విద్యార్థినులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో పాఠశాలకు సెలవు ప్రకటించిన విషయం తెలిసిందే. విద్యార్థినుల ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని, పాఠశాలలో సమస్యలు పరిష్కరించామని తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థినులను పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

సిపిఎంకు ఆర్థిక, హార్థిక సహకారం అందించండి

విస్తృత సమావేశంలో జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి-గుంటూరు

నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతూ, ప్రత్యామ్నాయ విధానాలకై కృషి చేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)ను ఆర్థికంగా, హార్థికంగా ఆదరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. పార్టీ నగర విస్తృత సమావేశము స్థానిక బ్రాడీపేటలోని సిపియం కార్యాలయంలో నగర కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక ప్రజలపై జిఎస్‌టి, పెద్ద నోట్ల రద్దుతో భారాలు మోపిందని, ఎన్‌ఆర్‌సి, సిఎఎ, ఎన్‌పిఆర్ వంటి నల్లచట్టాలు తెచ్చి ప్రజల మధ్య ఐక్యతను విచ్ఛిన్నం చేస్తుందని విమర్శించారు. కరోనా వైపరీత్యంలో ప్రజల జీవితాలను కాపాడాల్సింది పోయి, ప్రజల నిత్యవసర సరుకుల ధరలు భారీగా పెంచిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా మానిటైజేషన్ పేరుతో ప్రైవేటు వారికి అప్పగిస్తుందన్నారు. రాష్ట్రంలో ఆంధ్ర ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తూ, రాష్ట్రాల హక్కులను కాలరాస్తుందని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు బిజెపి ప్రభుత్వము అమలు చేయకుండా, రాష్ట్ర ప్రభుత్వం రాజధాని అమరావతిని మూడు ముక్కలు చేస్తుంటే చోద్యం చూస్తుందని విమర్శించారు. సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం షరతులకు లొంగి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్ను, చెత్త పన్ను, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు, విద్యుత్ చార్జీలు పెంచుతుందన్నారు. నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యారంగాన్ని చిన్నాభిన్నం చేసిందని, ఎయిడెడ్ వ్యవస్థను రద్దు చేసి పేదలకు చదువు దూరం చేస్తుందని అన్నారు. ఇలాంటి తరుణంలో ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ, సిపిఎం నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తుందని అన్నారు. అలాగే కరోనా కష్టకాలంలో గుంటూరు నగరంలో సిపిఎం కార్యాలయాన్ని ఐసోలేషన్ సెంటర్‌గా మార్చి కరోనా రోగులకు సేవలు చేసిందని, కామన్ కిచెన్ సెంటర్ ద్వారా కరోనా బాధితుల కుటుంబాలకు భోజనాలు అందించిందని తెలిపారు. ఇలాంటి ఉద్యమ, పోరాటాల చరిత్ర కలిగిన సిపిఎం పార్టీ నిర్వహణకు ఉద్యమ అవసరాలకు ఆర్థిక, హార్థిక సహకారం అందించవలసిందిగా ఆయన కోరారు. సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్ భావన్నారాయణ, నగర కార్యదర్శి వర్గ సభ్యులు బి ముత్యాలరావులు ప్రసంగించారు. సమావేశంలో నగర కమిటీ సభ్యులు ఎల్ అరుణ, షేక్ ఖాశిం వలి, బి.సత్యనారాయణ, షేక్ ఖాశిం షహీద్, ఎస్ కార్తీక్, జి రమణ, ఎల్ ఎస్ భారవి, ఆది నికల్సన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాశం రామారావు

రేపు బూరుగ సరస్వతి సంస్మరణ సభ

హాజరుకానున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - తాడేపల్లి



సిపిఎం పట్టణ నాయకులు, ఐద్వా పట్టణ మాజీ అధ్యక్షులు బూరుగ సరస్వతి సంస్మరణ సభ ఆదివారం ఉదయం 10 గంటలకు తాడేపల్లి పట్టణంలోని ప్రకాశ్‌నగర్ సెంటర్‌లో నిర్వహిస్తామని సిపిఎం పట్టణ కమిటీ తెలిపింది. ఈ మేరకు శుక్రవారం ఒక పకటనను నాయకులు జారీ చేశారు. సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు పాల్గొంటారని తెలిపారు.



బడ్జెట్‌లో మరోసారి అన్యాయం

దుగ్గిరాల తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం నిరసన

ప్రజాశక్తి - దుగ్గిరాల

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని అటు వ్యవసాయాన్ని ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కార్పోరేట్లకు మాత్రమే ప్రయోజనం కలిగే విధంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశ పెట్టిందని నాయకులు విమర్శించారు. శుక్రవారం ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో దుగ్గిరాల మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ఏఒక్క ప్రాజెక్టుకు నిధులు కేటాయించలేదని, నిరాశజనకంగా ఉన్న బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి బ్రహ్మాండంగా ఉందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను ప్రజా ప్రతినిధులు వ్యతిరేకించాలన్నారు.. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు నాయకులు వి సాంబశివరావు, యన్ యోగేశ్వరావు, జి శ్రీనివాసరావు, బి అమ్మిరెడ్డి, ఎ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఆప్కో చైర్మన్ చిరంజీవికి సన్మానం

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర ఆప్కో చైర్మన్‌గా గంజి చిరంజీవి శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పట్నానికి చెందిన పలువురు గంజి చిరంజీవిని సత్కరించారు. సత్కరించిన వారిలో పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు చింత క్రింది కనకయ్య, కార్యదర్శి దామర్లకుబేర స్వామి, నాయకులు ఆర్ పూర్ణచంద్రరావు, వంగర పెద లక్ష్మయ్య, జే బిక్షారావ్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న రామమోహనరావు

నిరంతర కృషితోనే విజయం

ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షులు రామమోహనరావు

ప్రజాశక్తి-గుంటూరు

వృత్తిలో రాణించటానికి కృషి ముఖ్యమని అదే విజయానికి మూలమని ఏపీ ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు ఆచార్య రామమోహనరావు అన్నారు. గుంటూరు జాగర్లమూడి చంద్రమౌళి న్యాయ కళాశాల మూర్టు సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న రెండవ జాతీయ స్థాయి ముట్కోర్టు పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో సూక్ష్మ పరిశీలన కీలకమని, పలు భాషల్లో నైపుణ్యం ఇందులో రాణించడానికి ఉపకరిస్తుందన్నారు. న్యాయవాదికి న్యాయపరమైన అంశాలతో పాటు సమాజాన్ని అర్థం చేసుకోవడం అవసరమని చెప్పారు. వ్యక్తిత్వం, అభివృద్ధి ఒక్కరోజులో సాధ్యం కాదని, అది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటువంటి పోటీల్లో పాల్గొనడం వలన నైపుణ్యాలను పెంచుకోవచ్చన్నారు. వేమన కుప్పుస్వామి మాట్లాడుతూ చక్కని గ్రంథాలయంతో పాటు, విద్యార్థులకు కోర్టు పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినేని సుధాకర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా రామమోహన్‌రావును యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో జెకెసి కళాశాల సెక్రెటరీ జాగర్లమూడి మురళీమోహన్, కె.ఎల్.పి పాఠశాల కార్యదర్శి డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ఆర్‌విఆర్ విద్యా కళాశాల కార్యదర్శి గద్దె మంగయ్య, న్యాయ కళాశాల సంయుక్త కార్యదర్శి భైరపనేని నరేష్, న్యాయవాదులు బ్రహ్మానందరెడ్డి, బ్రహ్మారెడ్డి తదితరులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

ఎంసిహెచ్ భవన నిర్మాణానికి సహకారం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో మాత శిశు సంరక్షణ కేంద్రం నిర్మాణనికి తమ వంతు సహకారం అందిస్తామని గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం (జింఖానా1968) బ్యాచ్ ప్రకటించింది. జింఖానా బ్యాచ్ కు చెందిన డాక్టర్ వెంకట్, డాక్టర్ నళినాక్షి, డాక్టర్ రామరాజు, డాక్టర్ సులోచన శుక్రవారం మాత శిశు సంరక్షణ కేంద్ర నిర్మాణ పనులను పరిశీలించారు. కేంద్ర నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతుండటం పై వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్ట్ వంద శాతం పూర్తి చేసేందుకు అవసరమైన ఆర్థిక చేయుత ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు. కార్యక్రమం లో జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, సమన్వయ కర్తలు డాక్టర్ బాలభాస్కర రావు, డాక్టర్ పి వి హనుమంత రావు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ సంచార పశు ఆరోగ్యసేవా వాహనం ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు


వాహనాన్ని ప్రారంభిస్తు ఎమ్మెల్యే, తదితరులు

పొన్నూరు నియోజకవర్గ పరిధిలోని చేబ్రోలు, పెదకాకాని మండలాలకు చెందిన డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా వాహనాన్ని శుక్రవారం పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పశువులకు అత్యవసర సేవలకు ప్రభుత్వం సంచార వాహనాలను ఏర్పాటు చేసిందని, ఈ వాహనంలో పశు వైద్యులు, వైద్య సహాయకుడు అందుబాటులో ఉంటారన్నారు. ప్రాధమిక వైద్య సేవలతో పాటు పశువులు, మేకలు, గొర్రెలు, పెంపుడు జంతువులకు మైనర్ సర్జరీలు చేసేందుకు వీలుగా వాహనాల రూపకల్పన చేయడం జరిగిందన్నారు. అసరమైతే హైడ్రాలిక్ లిఫ్ట్ సౌకర్యంతో పశువును వాహనంలోకి ఎక్కించి శస్త్రచికిత్సను సైతం చేసే సౌలభ్యం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జెపి.వెంకటేశ్వర్లు, తెనాలి పశు సంవర్ధక శాఖా డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జునరావు, చేబ్రోలు పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.సాంబశివరావు, పెదకాకాని పశు వైద్యాధికారి డాక్టర్ ఎస్.సుబ్బారెడ్డి, ఉప్పలపాడు పశు వైద్యాధికారి డాక్టర్ ఎం. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్వారీ తిరునాళ్లకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

ఎమ్మెల్యే కిలారి రోశయ్య


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోశయ్య

ప్రజాశక్తి-గుంటూరు : మహాశివరాత్రి సందర్భంగా చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీలోని శ్రీ బాల కోటేశ్వరస్వామి దర్శనానికి వచ్చే యాత్రికులకు ఇబ్బంది లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి, తిరునాళ్ల విజయవంతం చేయాలని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య కోరారు. శుక్రవారం నియోజక వర్గంలోని క్వారీ తిరునాళ్ల ఏర్పాట్లపై ఎమ్మెల్యే రోశయ్య, తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలిశర్మతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.1.56 కోట్ల వ్యవయంతో బాల కోటేశ్వర స్వామివారి దేవస్థానం పునర్నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. గతేడాది జరిగిన లోపాలను సవరించుకుంటూ ఈ ఏడాది తిరునాళ్ల ఏర్పాట్లకు సంబంధించి, నిర్దేశించిన రహదారుల విస్తరణ, క్యూలైన్ల ఏర్పాటు, బారీకేడ్ల ఏర్పాటు, ముఖ్యంగా ప్రభలు వచ్చి వెళ్లే సందర్భంలో యాత్రికులకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పార్కింగ్ ఏర్పాట్లు, తదితర అంశాలకు సంబంధించిన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. అలాగే శివరాత్రి సందర్భంగా పెదకాకాని, చేబ్రోలు క్వారీ దేవాలయాలకు యాత్రికులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. పారిశుధ్య సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలని, క్యూ లైన్లలో ఉన్న వారికి మంచినీరు, మజ్జిగ, చిన్న పిల్లలకు పాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ జామ్ లేకుండా ముఖ్యమైన ప్రాంతాలలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన డాక్టర్లు, వైద్య సిబ్బందితో, మందులతో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి, ప్రజలు కోవిడ్ నిబంధనలు పాటించేలా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని వైద్యాధికారులకు సూచించారు. తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ మాట్లాడుతూ నారాకోడూరు బైపాస్ మరమ్మతులు వెంటనేపూర్తి చేసి యాత్రికుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. సమావేశంలో తెనాలి డీఎస్పీ స్రవంతిరాయ్, పొన్నూరు తహశిల్దార్ శ్రీకాంత్, పొన్నూరు ఎస్.ఐ వెంకటాద్రి, ఆలయ ఈఓ రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలం కోసం వినతి

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండలంలోని బేతపూడి, గుండాలపాడులో గ్రామాల్లో ఎస్సీలు దాదాపు 250 కుటుంబాలు నివసిస్తున్నామని, సంవత్సరాల తరబడి స్మశాన స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని సమస్యల పరిష్కారం చేయాలని శుక్రవారం తహశీల్దార్‌నకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు బేతపూడిలో మాలదాసులు ఎస్సీలు150 కుటుంబాలు, గుండాలపాడు అగ్రహారం మాలదాసులు ఎస్సీలు 100 మంది నివసిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు బేతపూడి నుండి క ండ్రిక వెళ్లే రోడ్డు ప్రక్కన కొంత స్థలంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం ఆస్థలాన్ని చెరుకునకు కొంత, రోడ్డు విస్తరణకు కొంత ఉపయోగించడం వల్ల మనిషి చనిపోతే అంత్యక్రియలు చేయడానికి శశ్మానానికి స్థలం లేకుండా పోయిందని రెండు గ్రామాల ఎస్సీలు వాపోయారు. ఈ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు సంబంధిత అధికారులకు అర్జీ ఇచ్చినప్పటికీ ఉపయోగం లేకుండా పోయిందన్నారు. రెండు గ్రామాల్లో శ్మశాన స్థలాలను కేటాయించి చుట్టూ ప్రహరీ నిర్మించి ఇవ్వాలని తహశీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో బేతపూడి గ్రామ ఎంపీటీసీ షేక్ ఖాసిం షహీద్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ షేక్ ఖాజావలి, వైకాపా నాయకులు షేక్ చిన్న సుభాని, వినుకొండ సుభాని, బేతపూడి సొసైటీ చైర్ పర్సన్ షేక్ జాకీర్, దారా సుబ్బారావు, సిహెచ్ కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు





గురుకుల పాఠశాలలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

గురుకుల పాఠశాలలో పారిశుధ్య పనులపై అధికారులు దృష్టి పెట్టారు. మండలంలోని రామకృష్ణాపురం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పాఠశాలలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. మౌలిక సదుపాయాల కల్పనపైనా దృష్టి పెట్టారు. అత్యవసర పనులు కోసం రూ.లక్ష మంజూరు చేయడంతో డ్రెయినేజీ కాల్వ మరమ్మతులు చేయిస్తున్నారు. ముళ్ల కంపలను తొలగించారు. మరమ్మతులకు గురైన మినరల్ వాటర్ సిలెండర్లను మార్చారు. పనులను కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణకుమారి పర్యవేక్షిస్తున్నారు.

విశ్వనాథ్ మృతికి పుల్లారావు సంతాపం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను ఆధునిక తరాలకు సినిమాల రూపంలో తెలిపిన కళామతల్లి ముద్దుబిడ్డ కళా తపస్వి కె.విశ్వనాథ్ అని మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. ఎన్నో కళాత్మకమైన చిత్రాలతో తెలుగు వారి కీర్తి, ప్రతిష్టలను ప్రపంచానికి చాటిన విశ్వనాథ్ మృతి బాధాకరమని, సంతాపం ప్రకటించారు.

ఈపూరు సిహెచ్ సి వైద్యుడు మృతి

ప్రజాశక్తి-ఈపూరు



మండల కేంద్రమైన ఈపూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎమ్‌డి జనరల్ మెడిసిన్ వైద్యులుగా పనిచేస్తున్న డి.వాసు శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. అనారోగ్యం వల్ల చికిత్స కోసం మూడ్రోజుల కిందట హైదరాబాద్ వెళ్లిన ఆయనకు ఆపరేషన్ చేసే క్రమంలో గుండెపోటుకు గురై మృతి చెందారని స్థానిక వైద్య సిబ్బంది తెలిపారు. ఆయన మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

గురుకులం విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - నుజెండ్ల

మండలంలోని పాత ఉప్పలపాడులోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలోని 150 మంది పదో తరగతి విద్యార్థులకు ఇంగ్లీషు మీడియం స్టడీ మెటీరియల్‌ను అబ్దుల్ కలామ్ థెరిస్సా సేవా సొసైటీ నిర్వాహకురాలు చందోలు నాగవాణి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచాన్ని మార్చగలిగే శక్తి చదువుకే ఉందన్నారు. జీవితంలో పదో తరగతి చాలా కీలకమైందని, ఇప్పుడు సాధించే మార్కులే భవిష్యత్‌లో ఇతర కోర్సులకు బాటలు వేస్తాయని చెప్పారు. అందరూ శ్రద్ధగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.నాగేశ్వరమ్మ, వైస్ ప్రిన్సిపాల్ యు.లలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్‌తో విద్యార్థినులు

పుడా చైర్మన్‌గా రమేష్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - నరసరావుపేట



ర్యాలీగా వెళ్తున్న మిట్టపల్లి రమేష్, మంత్రి, ఎమ్మెల్యేలు

వైసిపిని నమ్మి ప్రజా సేవ చేసిన అందరికీ సరైన గుర్తింపు దక్కుతుందని, అందుకు నిదర్శనం మిట్టపల్లి రమేష్ అని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పుడా) చైర్మన్‌గా మిట్టపల్లి రమేష్ ప్రమాణ స్వీకారం సందర్భంగా పట్టణంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించగా మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మిట్టపల్లి కోటేశ్వరరావు హాజరయ్యారు. రమేష్‌కు తమ సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి సురేష్ చెప్పారు. రమేష్ ఈ పదవిలో ఏడాది పాటు కొనసాగనున్నారు. పట్టణంలోని జమిందారీ ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ వీరభద్రస్వామి, ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యేలు ఎన్.శంకరరావు, మద్దాలి గిరిధర్, బ్రహ్మానాయుడు, వి.శ్రీనివాస్, కాసు మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

టిడిపి ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - పెదకూరపాడు : మండలంలోని పాటిబండ్లలో టిడిపి కార్యకర్తలు, నాయకుల ఆత్మీయ సమావేశం శుక్రవారం నిర్వహించగా మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ హాజరయ్యారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, పార్టీ అభ్యున్నతికి అందరూ కృషి చేయాలని కోరారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు ఎ.రమేష్, నాయకులు బి.రామ్‌గోపాల్‌రావు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లాలో 17 మందికి విదేశీ విద్యా దీవెన

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా



లబ్ధిదార్లకు మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్ తదితరులు

జగనన్న విదేశీ విద్యా దీవెన కింద పల్నాడు జిల్లాలో 42 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా తొలి విడతలో 17 మంది ఎంపికయ్యారని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సిఎం శుక్రవారం ప్రారంభించగా పల్నాడు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయులు, పెదకూరపాడు ఎమ్మెల్యే ఎన్.శంకరరావు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుత9ఊ లబ్ధిదార్లలో ముగ్గురు ఎస్సీలు, ఏడుగురు ఈసీబీ, ముగ్గురు బీసీలు, నలుగురు మైనార్టీ సామాజిక తరగతులకు చెందిన వారు ఉన్నారని వివరించారు. వీరందరికీ కలిపి తొలి విడతలో రూ.1,01,05,214 జమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వయో వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్పొరేషన్ చైర్ పర్సన్ ముంతాజ్ పటాన్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఓబులు నాయుడు, మైనారిటీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి మహమ్మద్ ఘనీ, జిల్లా బి.సి సంక్షేమ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన శాఖ సంక్షేమ శాఖ అధికారి వరలక్ష్మి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా లబ్ధిదార్లలో పెదకూరపాడు నియోజకవర్గానికి చెందిన వారు ఐదుగురు ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు. వీరికి రూ.16.91 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. అచ్చంపేట మండలం తాళ్లచెరువుకు చెందిన దారా అఖిల్, బెల్లంకొండ మండలం మాచాయపాలేనికి చెందిన సోమాబత్తిన స్రవంతి, పెదకూరపాడుకు చెందిన చింతాబత్తిన సాయికిరణ్, 75 తాళ్లూరుకు చెందిన వజ్రాల మల్లికార్జునరెడ్డి, అమరావతికి చెందిన పెరికల భాగ్యశ్రీ లబ్ధిపొందారని తెలిపారు.

ఆకస్మిక తనిఖీలు, సమీక్షలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్



విజయపురిసైత్ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ

మాచర్ల మండలంలోని విజయపురిసౌత్‌లోని 1, 2 సచివాలయాలను ఆర్‌డిఒ, మండల ప్రత్యేకాధికారి గభనాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. గృహ నిర్మాణాల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన పట్టాలను ఆన్‌లైన్ చేయాలని చెప్పారు. అనంతరం స్థానిక గృహ నిర్మాణ లే అవుట్‌ను పరిశీలించారు. గతంలో గ్రామీణ ఆవాస్ యోజన పథకం కింద ఇళ్లు మంజూరయ్యాయని, ప్రస్తుతం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ కింద నిర్మాణం చేపట్టాల్సి ఉంటుందని చెప్పారు. విజయపురిసౌత్‌లో 454 పట్టాలిచ్చామని, మరో 80 మందికి లేఅవుట్ డెవలప్ చేయాల్సి ఉందని వివరించారు. ఒకటో సచివాలయంలో 80 శాతం సిబ్బంది హాజరే నమోదవగా మిగతా వారేరని వివరణ అడిగారు. తనిఖీల్లో ఇన్‌చార్జి ఎంపిడిఒ కోటేశ్వరరావు, పంచాయితీ కార్యదర్శి దస్తగిరి పాల్గొన్నారు.

స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను మండల ప్రత్యేకాధికారి గభ నాయక్, ఇన్‌చార్జి ఎంపిడిఒ కోటేశ్వరరావు సందర్శించారు. విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించడంతోపాటు సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. శ్రద్ధగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ నాగయ్య, హెచ్‌ఎం కేతావత్ శ్రీను నాయక్, వైస్ ప్రిన్సిపల్ జాన్సన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఈపూరు

ప్రభుత్వ లక్ష్యాలను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని అధికారులకు మండల ప్రత్యేకాధికారి, పౌరసరఫరాల శాఖ డిపో మేనేజర్ జి.వరలక్ష్మి సూచించారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమీక్షించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించాలని, సచివాలయ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని చెప్పారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. కూచినపల్లిలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించి లబ్ధిదార్లతో మాట్లాడారు. కార్యక్రమంలో తహసిల్దార్ సిహెచ్ విజయజ్యోతికుమారి, ఎంపిడిఒ ఎ.ఉషాకిరణ్, గృహ నిర్మాణ ఎఇ బి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



చిన్నారి వైద్యం కోసం సాయం..

ప్రజాశక్తి - పెదకూరపాడు : అబ్బరాజుపాలేనికి చెందిన చౌటూరి మేరీకి మాగులూరి ఫౌండేషన్ రూ.5 వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందించింది. మేరి కొంతకాలంగా గుండె జబ్బుతో బాధపడుతుండడంతో వైద్య ఖర్చుల కోసం ఈ మొత్తాన్ని ఇచ్చినట్లు ఫౌండేషన్ నిర్వాహకులు మాగులూరి కృష్ణారావు తెలిపారు.



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్ : స్థానిక ప్రభుత్వ పాఠశాలలోని వివిధ తరగతుల్లో ఉత్తమ విద్యార్థులకు 1985-86 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు నగదు ప్రోత్సాహకాలను శుక్రవారం అందించారు. పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ఆశాలతా బాయ్ ఆధ్వర్యంలో మేడికొండూరి రోశయ్య, ఆదిశేషమ్మ దంపతుల జ్ఞాపకార్థం కుమార్తె హైమావతి, అల్లుడు బత్తిన శ్రీనివాస్‌బాబు, మనవరాలు మంజీరాలు వీటిని సమకూర్చారు. 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు మొదటి, ద్వితీయ స్థానాలు సాధించిన వారికి నగదుతోపాటు సాహిత్య, చారిత్రాత్మక, సామాజిక అంశాలతో కూడిన పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కృష్ణమోహన్, నాగశ్రీను, రమణ, పుల్లయ్య, రాజారత్నం, ఉపాధ్యాయులు యు.లక్ష్మి, ఆనంద్‌బాబు, కె.కోటేశ్వరరావు, మల్లికార్జునరావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

కొండూరులో ఎమ్మెల్యే శంకరరావు ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - అచ్చంపేట



మండంలోని కొండూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ప్రచారం చేసి కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివృద్ధిలో గత ప్రభుత్వం 10 శాతమైనా చేసిందా? అని ప్రశ్నింకచారు. గత పాలకులు అందులో కనీసం పదిశాతమైనా చేశారా అని ప్రశ్నించారు. తమది గ్రాఫిక్స్ ప్రభుత్వం కాదని, అభివృద్ధిని చేతల్లో చూపిస్తున్నామని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సిఎంను చేయాలని కోరారు.

'బడ్జెట్‌ను ప్రశ్నించకుండా రాజధానులట'

ప్రజాశక్తి - రొంపిచర్ల : కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి అన్యాయం జరిగినా ప్రశ్నించని ముఖ్యమంత్రి మూడు రాజధానులనే మూడుముక్కలాటకు తెరలేపారని దళిత బహుజనుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జి.రమేష్‌కుమార్ విమర్శించారు. నల్లగార్లపాడులోని సమితి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మూడు రాజధానులు పక్కన పెట్టి ఉద్యోగులకు ప్రతినెలా ఐదో తేదీలోపు 3 నెలలు జీతాలు జమ చెయ్యగలరా? అని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా, విభజన హామీలపై కేంద్రంపై ఒత్తిడి పెంచాలని కోరారు.



ఉర్దూ పాఠశాలలో తనిఖీ

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలోని పినపాడు, రూరల్ పరిధిలోని తేలప్రోలు ఉర్దూ పాఠశాలలను ఉప విద్యాధికారి(ఉర్దూ) ఎండి ఖాసిం శుక్రవారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, పాఠ్యప్రణాళికలను పరిశీలించారు. పాఠ్యాంశాల పరంగా విద్యార్థుల సామర్థ్యాలను, అలాగే పాఠశాల్లో అమలౌతున్న గోరుముద్ద పథకాన్ని, భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రిహానా,అయేషా రియాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులపై శిక్షణ

ప్రజాశక్తి -దుగ్గిరాల

ఆయుష్మాన్ భారత్ సర్వేలో భాగంగా శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సర్వే అనంతరం హెల్త్ కార్డులను అందజేస్తారు. ఈ కార్డు ఉన్నవారు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన వైద్యశాలలో వైద్యం పొందే అవకాశం ఉంటుంది. ఇంతవరకు మండల వ్యాప్తంగా 61 శాతం సర్వే పూర్తయినట్లు ఎంపీడీవో కుసుమ శ్రీదేవి తెలిపారు. సర్వే నిర్వహించేటప్పుడు ఈకెవైసి లేదా ఐరిష్ తీసుకుంటారు. అటువంటి సందర్భాలలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా గుంటూరు నుంచి వచ్చిన టెక్నికల్ టీం సభ్యులు ఎన్ రవిచంద్ర, షేక్ ఫాతిమా, హసీనా వాలంటీర్లకు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డి.వీరయ్య ,మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కార్యదర్శులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణం వేగవంతం

ప్రజాశక్తి- దుగ్గిరాల

జగనన్న ఇళ్ల నిర్మాణం రాబోయే ఉగాది నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టడంతో మండల వ్యాప్తంగా నిర్మాణాలు వేగ వంతం చేసినట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం మండలంలోని శంగారపురం గ్రామంలో 12 గృహాల శంకుస్థాపనలో వారు పాల్గొని మాటాడారు. ఇంతవరకు పునాదివేయనీ ఇళ్ల నుండి వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులు లబ్ధిదారులకు సలహాలు సూచనలు చేసి వారి చేత ఇల్లు కట్టుకునే విధంగా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ఎంపీడీవో కుసుమ, శ్రీదేవి, హౌసింగ్ ఏఈ. ఎస్కేయం షా,లు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పాదయాత్ర

ప్రజాశక్తి-తాడేపల్లి: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం తాడేపల్లిలో పాదయాత్ర నిర్వహించారు. మహానాడు, సీతానగరం, ఉండవల్లి సెంటర్, పోలకంపాడు వరకు పాదయాత్ర జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ఎస్కె సలీం, నాయకులు జీవనసాగర్, శామ్యూల్, కె.శ్రీరామ్మూర్తి, జి.సాంబశివరావు, కృష్ణచౌదరి, జి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు 200 చెక్కబల్ల బండ్లు పంపిణీ



పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి- మంగళగిరి

చిర వ్యాపారుల చేయూతకు మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 200 రోటరీ చేయూత చక్రాల చెక్కబల్ల బండ్లను పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక మంగళగిరి నిడమర్రురోడ్‌లోని మహాలక్ష్మి గార్డెన్స్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి, రోటరీ హైదరాబాద్ డెక్కన్, రోటరీ క్లబ్ లేక్ డిస్టిక్ మొయినాబాద్, మూడు క్లబ్లు సంయుక్తంగా సుమారు రూ. 30 లక్షలతో చెక్క బండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి రోటరీ అంతర్జాతీయ డైరెక్టర్ మహేష్ కొట్బాగి, అంతర్జాతీయ నాయకులు ప్రశాంత్ జానీ, వడ్లమాని రవి, రోటరీ జిల్లా 3150 గవర్నర్ తాళ్ల రాజశేఖర్ రెడ్డి అతిథులుగా పాల్గొన్నారు. రోటరీ అంతర్జాతీయ ప్రతినిధులు మాట్లాడుతూ ఒకరుగా అయితే ఒకరికి మాత్రమే సహాయం చేయగలం ఇటువంటి రోటరీ లాంటి సంస్థల ద్వారా కొంతమంది కలిస్తే ఎంతోమందికి ఉపాధి కల్పించవచ్చనే సదుద్దేశంతో చిరు వ్యాపారస్తులకి తోపుడు బండ్లు అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల నుంచి రోటరీ ప్రతినిధులు పాల్గొన్నారు. రోటరీ క్లబ్ మంగళగిరి అధ్యక్షుడు సతీష్ బాబుని, ఈ ప్రాజెక్ట చైర్మన్‌గా వ్యవహరించిన అనిల్ చక్రవర్తిని అంతర్జాతీయ రోటరీ నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ మంగళగిరి ప్రతినిధులు గాజుల శ్రీనివాసరావు, రావెల శ్రీనివాసరావు, నిరంజన్ గుప్తా, పి రాజశేఖర్, వి వి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నూతన పింఛను మంజూరు

ప్రజాశక్తి-తాడేపల్లి

స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పట్టణంలోని ప్రకాష్‌నగర్ ప్రాంతంలో శుక్రవారం పర్యటించారు. విషయం తెలుసుకున్న ఉండవల్లి సెంటర్ జామాయిల్ తోట బజార్‌కు చెందిన సతీష్‌రెడ్డి తన తల్లిదండ్రులకు పింఛను రావడంలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఆర్‌కె అధికారులతో మాట్లాడి పింఛను వచ్చే విధంగా చూడాలని అధికారులకు తెలిపారు.అడిగిన వెంటనే పింఛను మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే ఆర్కేకు సతీష్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

యర్రబాలెం విద్యార్థికి విదేశీ విద్యా దీవెన



ఎమ్మెల్యే ఆర్కేకు కృతజ్ఞతలు తెలుపుతున్న శ్రీనివాసరావు

మంగళగిరి రూరల్: జగనన్న విదేశీ విద్యా దీవెనకుయర్రబాలెం విద్యార్థి బండి గణ శ్యామ్ ఎంపికయ్యారు. గణ శ్యామ్ అమెరికాలోని న్యూయార్క్ యూనివర్శిటీ (ఎన్‌వైయు)లో గత ఏడాది అడ్మిషన్ పొంది ఎంఎస్ డేటా సైన్స్ విద్యను అభ్యసిస్తున్నాడు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం కింద విద్యార్థి గణ శ్యామ్‌కు రూ.64లక్షలను మంజూరు చేయగా శుక్రవారం సీఎం జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా బటన్ నొక్కి తొలి విడతగా సుమారు రూ.16లక్షలను ఖాతాకు జమ చేశారు. సీఎం జగన్ మోహన్ రెడ్డికి తండ్రి శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. అందుకు సహకరించిన స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిని విద్యార్థి తండ్రి శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. జగనన్న విదేశీ విద్యా దీవెన పథకానికి గుంటూరు జిల్లా నుంచి నలుగురు విద్యార్థులు ఎంపిక కాగా వారిలో మంగళగిరి నియోజకవర్గ పరిధి యర్రబాలెంకు చెందిన విద్యార్థి గణ శ్యామ్ ఎంపిక కావడం ఎంతైనా అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గుండాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న శివానంద సరస్వతి

18 నుంచి రజతోత్సవాలు

ప్రజాశక్తి-తాడేపల్లి: ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు చైతన్య తపోవన్ రజతోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు చైతన్య తపోవన్ ట్రస్టు శ్రీ మాతా శివానంద సరస్వతి తెలిపారు. శుక్రవారం నులకపేట తపోవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రజతోత్సవ వేడుకల్లో చాగంటి కోటేశ్వరరావుతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ట్రస్టు సభ్యులు కోరారు.


లోకేష్ పాదయాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-తాడేపల్లి: ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారం కోసం నారా లోకేష్ చేస్తున్న పాదయాత్రను జయప్రదం చేయాలని టిడిపి సీనియర్ నాయకులు పి.రామారావు కోరారు. శుక్రవారం పెనుమాకలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పాదయాత్రకు అడుగడుగునా అడ్డంకులు సృష్టించడం సరికాదన్నారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసిన సందర్భంలో అప్పటి ప్రభుత్వం ఇలాంటి అడ్డంకులు సృష్టించి ఉంటే పాదయాత్ర చేసేవారా అని ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీగా ప్రజల్లోకి వెళ్లడం, సమస్యలు తెలుసుకోవడం వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకురావడం అవి పరిష్కారం అయ్యేందకు కృషి చేయడం ప్రతిపక్షపార్టీ బాధ్యతని చెప్పారు. రాజధాని అమరావతి భ్రమరావతిగా చేశారని విమర్శించారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్ర అభివృద్ధి 20 ఏళ్ల వెనక్కి వెళ్లే విధంగా జగన్ పాలన ఉందని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వచ్చేందుకు కార్యకర్తలు అకుంఠిత దీక్షతో పని చేయాలని కోరారు. ఈ సమావేశంలో పెనుమాక అధ్యక్షులు వీరేంద్రనాథ్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-తెనాలి

పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. స్థానిక రామకృష్ణ కవి కళాక్షేత్రంలో శుక్రవారం జగనన్న తోడు పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘ పరిధిలో 709 మందికి రూ.10వేల చొప్పున జగనన్న తోడు పథకంలో పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. వీరిలో గతంలో లబ్ధిదారులు 586 మంది ఉన్నారని, నూతనంగా మంజూరైన వారు 123 మంది ఉన్నారరన్నారు. మొత్తంగా రూ. 70.90లక్షలు పంపిణీ చేశామన్నారు. ప్రజాసంక్షేమం కోరి పనిచేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదానశీం, కమిషనర్ ఎం.జస్వంతరావు, బీసీ నాయకులు కొడాలి క్రాంతి కుమార్, కె.వాసు, పి.రమణ, నాయకులు యద్దనపూడి శివ, ఫైనాన్స్ కార్పోరేషన్ డైరెక్టర్ ఎం.ప్రభాకర్, అక్కిదాసు కిరిణ్‌కుమార్, బాలా, మెప్మా సిఎంవోలు మాధవరావు, అరుణ, ఆర్‌పిలు పాల్గొన్నారు.



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్



బైరాగిని సత్కరిస్తున్న థియేటర్ కమిటీ బృందం

గాయకుడు బైరాగికి సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

శఖపురుషుని శతజయంతి పేరిట స్థానిక బోస్‌రోడ్డులోని పెమ్మసాని థియేటర్‌లో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారథ్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సవాల్లో శుక్రవారం ఎన్టీఆర్ నటించిన తోడు నీడ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. అలాగే కళాకారుల సత్కారాల పండుగలో భాగంగా పట్టణానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక గాయకుడు, భజన సంకీర్తనాపరుడు కూనపరెడ్డి బైరాగిని థియేటర్ కమిటీ సభ్యులు పోలవరపు జనార్ధన్, వీరమాచనేని వెంకటసుబ్బారావు, సీహెచ్ సుబ్రహ్మణ్యం, ఆర్.శివశంకర్, బి.శ్రీనివాసరావు సత్కరించారు. కార్యక్రమంలో పి. పోతురాజు, డాక్టర్ ఎ. మల్లేశ్వరరావు, డి. భవాని, జగన్, ఎం.రాఘవరావు, జి.ప్రసాద్, ఎన్.శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఎఎస్ఎన్ విద్యార్థులకు బెస్ట్ యూత్ రెడ్‌క్రాస్ పురస్కారం

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు తెలంగాణా రాష్ట్రంలోని ఇంటలెక్యువల్ ఫోరం సంస్థ అందించిన బెస్ట్ యూత్ రెడ్‌క్రాస్ పురస్కారాలను అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాల్లో ఏర్పాటు చేసిన సభలో ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్ అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశలో సేవాభావం అలవరచు కోవటం అభినందనీయమని అన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ మాట్లాడుతూ వివేకానంద 160వ జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా రెడ్‌క్రాస్ సంస్థకు అనుబంధంగా చేస్తున్న సేవలకుగాను బెస్ట్ యూత్ రెడ్‌క్రాస్ పురస్కారాన్ని అందించారన్నారు. పురస్కారాలు అదుకున్నవారిలో ధనుంజయ్, సాయినితిన్, లక్ష్మణ్, నాగార్జునరెడ్డి, సుమలత, దివ్య ఉన్నారన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సంస్థ తెనాలి యూనిట్ చైర్పర్సన్ ఎం.భానుమతి, ఏఎస్ఎన్ యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్ డాక్టర్ టి.లక్ష్మిదుర్గ,విద్యార్థులు పాల్గొన్నారు.



చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగనవాడి కేంద్రాలకు పంపడం వలన వారికి పౌష్టికాహారంతో పాటు అన్ని వసతులను ప్రభుత్వం కల్పించిందని ఈ అవకాశాన్ని తల్లిదండ్రులందరూ ఉపయోగించుకోవాలని మండల విద్యాశాఖ అధికారి బాలసుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం పెదనందిపాడు బీసీ-2 అంగన్వాడి సెంటర్లో చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలను మండల విద్యాశాఖ అధికారి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులకు అంగనవాడి సిబ్బందికి ఎంఈఓ బాలసుబ్రమణ్యం పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాల బ్రహ్మచారి ,అంగన్వాడి కార్యకర్తలు ధనలక్ష్మి, పద్మ, సుజాత, సైదాని, చిన్నారుల తల్లిదండ్రులు, కాకుమాను భార్గవ్, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్‌విఆర్‌లో ఎథికల్ హ్యాకింగ్ సర్టిఫికెట్ల ప్రదానం



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు : సమాజంలో పెరిగిపోతున్న సైబర్ నేరాలను నియంత్రించే దిశగా విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. నార్తన్ లైఫ్‌లాక్ సాంకేతిక పరిశ్రమ సహకారంతో నాస్కం ఫౌండేషన్ ద్వారా సిఎస్ఆర్ కింద ఏటిఎం కన్సల్టెన్సీ కంపెనీ ఆధ్వర్యంలో ఆర్‌విఆర్‌లో ఎంసిఎ విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీకి సంబంధించిన ఎథికల్ హ్యాకింగ్ అనే అంశంపై శిక్షణా తరగతులు, పరీక్షలు నిర్వహించి, ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లను అందచేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, నాస్కం ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ సంతోషరావు, టిఎంఐ కన్సల్టెన్సీ కంపెనీ డిఎం నరేంద్రనాద్, కళాశాల స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ ఎంవిపి చంద్రశేఖర్ చేతులమీదుగా విద్యార్థులకు సర్టిఫికెట్లను అందచేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.



టాపర్లతో అన్నా నందకిషోర్, డైరెక్టర్ శ్రీలక్ష్మి తదితరులు

సిఎ ఫౌండేషన్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు : ది ఇనిస్టి ట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఫిబ్రవరి 3న ప్రకటించిన సిఎ ఫౌండేషన్ ఫలితాలలో శ్రీమేధ విద్యార్థులు అఖిల భారత స్థాయిలో అత్యుత్తమ మార్కులతోపాటు అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించారని సంస్థ చైర్మన్ సి.ఎ.అన్నానందకిషోర్ తెలియజేశారు.శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థి 400 మార్కులకుగాను బి.ఫణంద్ర 354, డి.సత్యసాయిదుర్గ 342, ఎ.ఉమేష్ 322, ఎండి.అసద్ 317, షేక్.నజీరుద్దీన్, బి.లక్ష్మిలహరి 310, బి.థెరిసా పూజిత 306 మార్కులు సాధించారని పేర్కొన్నారు. అత్యుత్తమ మార్కుల సాధించటానికి కారణమైన శ్రీమేధ అధ్యాపక, సిబ్బందికి అభినందనలు తెలిపారు. సిఎ ఫౌండేషన్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు సిఎ ఇంటర్ క్లాసులు, ఉత్తీరుణలు కాని వారికి క్లాసులు ఈనెల 6వ తేదీన నుండి ప్రారంభం కానున్నట్లు చెప్పారు. టాపర్లను చైర్మన్ అన్నా నందకిషోర్, డైరెక్టర్ శ్రీలక్ష్మి, అధ్యాపకులు అభినందించారు.



నిరసనలో పాల్గొన్న ఆర్టీసి ఉద్యోగులు

బకాయిల కోసం ఎస్‌డబ్ల్యూఎఫ్ నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

ఆర్టీసీ ఉద్యోగులకు గత ఐదు నెలలుగా బకాయి ఉన్న ఓ.టి. అలవెన్సు, ఇతర అలవెన్సులు తక్షణం చెల్లించాలని, 1/2019 సర్క్యులర్ కొనసాగించాలని, అప్పీల్స్ పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపియస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక ఎన్‌టిఆర్ బస్టాండ్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి యం.హరిప్రసాద్ మాట్లాడుతూ ఓ.టి అలవెన్సులు చెల్లించాలని లేకుంటే డ్యూటీ అయినా మార్చాలని డిమాండ్ చేశారు. ఓ.టి, ఇతర అలవెన్సులు బస్ క్యాష్ నుండి చెల్లించే ఏర్పాటు చేయాలన్నారు. సర్క్యులర్ నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగులపై సస్పెన్షన్లు, తొలగింపులు, ఆపాలని, గత తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న అప్పీల్స్ పరిష్కారం చేయాలని కోరారు.అలాగే బకాయి ఉన్న పీఆర్సీ ఎరియర్స్, లీవు ఎన్‌క్యాష్‌మెంట్, డిఏలు, ఆర్థిక బకాయిలు చెల్లించాలన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి ఆర్టీసీ ఉద్యోగులు సిద్ధపడాలని పిలుపు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి టి.వి.జి.రవిశంకర్, ఉపాధ్యక్షులు ఆర్.శ్రీనివాసరావు, యస్.కే.ఏ.బాషా,బి.వి.రాఘువులు తదితరులు పాల్గొన్నారు.

మలబార్ షోరూమ్ జువెలరీ షో

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు లక్ష్మీపురం మలబార్ గోల్డ్, డైమండ్స్ షోరూంలో ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యువలరీ షో' శుక్రవారం ప్రారంభం అయింది. బంగారం, వజ్రాభరణాలు జాతి రత్నాభరణాలను ప్రదర్శనలో ఉంచారు. ప్రారంభ ఉత్సవంలో ఎమ్మెల్యే ముస్తాఫా కుమార్తె షేక్ నూరి ఫాతిమా, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు డాక్టర్ యేలూరి మానస, డాక్టర్ ఈదర ప్రజ్ఞానంజలి, పెద్ది రమణరావు పాల్గొన్నారు. హస్తకళా నైపుణ్యతతో తయారైన ఆభరణా లు, "జోల్" అధునాతన డిజైన్లతో తేలికపాటి ఆభరణాలు ప్రదర్శనంలో ఉంచడం ముదా వాహం అని వారు పేర్కొన్నారు. శుక్రవారం నుంచి సోమ వారం వరకు ఈ ప్రదర్శన జరుగుతుంది. ఈ సందర్భంగా పలు రాయి తీలను ప్రకటించారు.



11, 12 తేదీల్లో గుంటూరు బాలోత్సవం



బాలోత్సవ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కెఎస్ లక్ష్మణరావు తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక లక్ష్మీపురంలోని, పాటిబండ్ల సీతారామయ్య స్కూల్ ప్రాంగణంలో 11, 12 తేదీల్లో నిర్వహిస్తున్న గుంటూరు జిల్లా బాలోత్సవాన్ని విజయవంతం చేయాలని బాలోత్సవం అధ్యక్షులు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. బ్రాడీపేట, యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం బాలోత్సవం పోస్టర్‌ను లక్ష్మణరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4, 5, 6, 7 తరగతుల విద్యార్థులు జూనియర్స్‌గాను, 8, 9, 10 తరగతుల విద్యార్థులు సీనియర్స్‌గా పోటీలు ఉంటాయన్నారు. ఫ్యాన్సీడ్రస్, ఏకపాత్ర, స్కిట్, శాస్త్రీయ సంగీతం, దేశభక్తి గేయాలు, వాద్య సంగీతం, వక్తృత్వం, పద్య పఠనం, స్పెల్‌బి, డ్రాయింగ్, పొట్రేట్, కేలియోగ్రఫీ, మట్టితో బొమ్మలు, చెక్కభజన, శాస్త్రీయ నృత్యం, జానపద నృత్యం, వెస్టన్ డ్యాన్స్, క్విజ్, షార్ట్‌ఫిల్మ్, వ్యాసరచన, కొల్లేజ్, కథచెబుతాను, కోలాటం, మొదలైన విభాగాల్లో పోటీలుంటాయన్నారు. బాలోత్సవం ప్రధాన కార్యదర్శి బి.ప్రసాద్ మాట్లాడుతూ పోటీలలో పాల్గొన్న అందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ఇస్తామన్నారు. ఎంట్రీ ఫీజు లేదని, మధ్యాహ్నం భోజన సదుపాయం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ ఎం.బోసుబాబు, జి.వెంకట్రావు, చావా శ్రీనివాస్, ఇ.అనిల్‌కుమార్, బి.శంకర్‌సింగ్, రామ్మోహన రావు, పి.అనంతలక్ష్మి, ఆర్.స్వాతి, టి.ఆర్. చాందిని, యం.ఉదయభాస్కర్, జోజిబాబు, ఇ.ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇతర వివరాలకు 97035 79996 నంబరులో సంప్రదించాలన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

పల్నాడు డిఇఒ ఎం.వెకటప్పయ్య



ప్రజాశక్తి - అమరావతి

9,10 తరగతుల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఎం వెంకటప్పయ్య తెలిపారు. శుక్రవారం అమరావతి శ్రీరామకృష్ణా హిందూ హైస్కూల్లో పెదకూరపాడు నియోజకవర్గ మండలాల పరిధిలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, 9,10 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో డిఇఒ మాట్లాడుతు ఇటీవల జరిగిన ఎస్.ఏ1పరీక్షల ఆధారంగా 9,10 తరగతుల విద్యార్థులు సాధించిన ప్రగతి ఆధారంగా సబ్జెక్టుల వారిగా లాంగ్వేజ్, నాన్ లాంగ్వేజ్ ఉపాధ్యాయులను ఉన్నతాధికారులు అడిగి తెలుసుకున్నారు. ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులను వ్యక్తిగతంగా విద్యార్థులు వెనుక బడుటకు కారణాల వివరాలను ఉన్నతాధికారులు అడిగి తెలుసుకున్నారు. వివిధ అంశాలలో వెనుకబడిన విద్యార్థినులను గమనించి వార్షిక పరీక్షలలో పాఠశాల, సబ్జెక్టుల స్థాయిలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని పలు సూచనలు చేశారు. ఫేజ్1నాడు నేడు మేజర్, మైనర్ మంచి ప్రగతి సాధించేందుకు కృషి చేశారని, మార్కుల శాతం పెంచేందుకు కృషి చేయవలసిన అవసరం ఎంతైన ఉందన్నారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఉప విద్యాశాఖాధికారి వి.వెంకటేశ్వరావు, ప్రధానోపాధ్యాయులు అసోసియేషన్ అధ్యక్షులు తిరుమలేష్, క్రోసూరు, అమరావతి ఎంఇఒ జి.ఏసురత్నం, మేడా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కళాతపస్వి విశ్వనాథ్ అడుగుజాడలు

ఉమ్మడి గుంటూరు జిల్లాతో విడదీయరాని అనుబంధం





ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రముఖ దర్శకుడు కాశీనాథుని విశ్వనాథ్ ఉమ్మడి గుంటూరు జిల్లా భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామంలో 1930 ఫిబ్రవరి 19న జన్మించారు. ఆయన జన్మించారు. ప్రాథమిక విద్య చదివారు. తరువాత విజయవాడ వెళ్లారు. ఉన్నత పాఠశాల విద్య అంతా విజయవాడ లోనూ ఇంటర్‌ను గుంటూరు హిందూ కళాశాల, బిఎస్‌సి గుంటూరు ఎసి కళాశాలలో చదివారు. విశ్వనాథ్ తండ్రి సుబ్రహ్మణ్యం పెదపులివర్రు శివాలయంలో ప్రధాన అర్చకులుగా పనిచేశారు. తరువాత చెన్నైలోని శ్రీ వాహినీ సినీ స్టూడియో ఉద్యోగం రావడంతో గ్రామం విడిచి వెళ్లారు. డిగ్రీ పూర్తి చేసిన తరువాత కొద్ది రోజులకు విశ్వనాథ్ కూడా తండ్రి పనిచేసే స్టూడియోలో సౌండ్ ఇంజినీరుగా చేరారు. అక్కడి నుంచి ఆయన సినీ ప్రస్తానం ప్రారంభం అయింది. చెన్నై లోని ఒక స్టూడియోలో సౌండ్ రికార్డిస్టుగా సినిమా జీవితాన్ని మొదలుపెట్టాడు. అన్నపూర్ణ సంస్థ నిర్మించిన తోడికోడళ్ళు అనే సినిమాకు పనిచేస్తున్నపుడు దర్శకుడు ఆదుర్తి సుబ్బా రావుతో పరిచయం ఏర్పడి ఆయన వద్ద సహాయకుడిగా చేరాడు. ఆయనతో కలిసి అన్నపూర్ణ వారి ఇద్దరు మిత్రులు, చదువుకున్న అమ్మాయిలు, డాక్టర్ చక్రవర్తి సినిమాలకు సహాయ దర్శకుడిగా పనిచేశాడు. అప్పటికే ఆయన ప్రతిభను గుర్తించిన అక్కినేని నాగేశ్వరరావు తర్వాత సినిమాకు దర్శకుడిగా అవకాశం ఇస్తానని వాగ్దానం చేశాడు. అలా డాక్టర్ చక్రవర్తి తర్వాత అక్కినేని నాయకుడిగా నిర్మించిన ఆత్మ గౌరవం సినిమాతో విశ్వనాథ్ దర్శకుడిగా మారారు. అంచెలంచెలుగా ఎదిగారు, 50 చిత్రాలకు దర్శకత్వం వహించి ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందారు. తెనాలి సమీపంలో బుర్రిపాలెంలో సినీనటుడు ఘట్టమనేని కృష్ణ తొలి సినిమా తెనె మనసులు షూటింగ్‌కు ముందు విశ్వనాథ్ కృష్ణకు నడక, వాచకంలో శిక్షణ ఇచ్చారు. ఆ అనుబంధం తరువాత కూడా కొనసాగింది. కృష్ణతో కన్నె మనసులు సినిమా తీశారు. ఆ తరువాత విశ్వనాథ్‌కు తెనాలితో అనుబంధం మరింత పెరిగింది. హీరోయిన్ శారదతో 'శారద' సినిమా తీశారు. తెనాలికి చెందిన అభ్యుదయ రచయిత బొల్లిముంత శివరామకృష్ణ ఈ చిత్రానికి సంభాషణలను సమకూర్చారు. బొల్లిముంత మృతి చెందిన తరువాత ప్రతి ఏటా ఇస్తున్న బొల్లిముంత పురస్కారాన్ని 2012లో విశ్వనాథ్ అందుకున్నారు. 1974లో తెనాలి కల్చరల్ ఫిలిం సొసైటీ తరుఫున విశ్వనాథ్‌ను సత్కరించారు. గుంటూ రు, తెనాలి, బాపట్ల తదితర పట్టణాల్లో పలు సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. గుంటూరు కళాదర్బార్, దాసరి కల్చరల్ అకాడమి ఆధ్వర్యంలో గుంటూరులో మూడు సార్లు సన్మానించామని కళాదర్బార్ అధినేత పి.రంగారావు తెలిపారు. 1983లో మొదటి వార్షిక వేడుకలకు విశ్వనాథ్, కమలహాసన్ గుంటూరుకు వచ్చారని, 1986, 1993లో కూడా సన్మానించామని చెప్పారు. విశ్వనాథ్ మృతి కళా, సినీ, సాహిత్య, సంగీత రంగాలకు తీరని లోటని పేర్కొన్నారు. గుంటూరులో సన్మాన సభకు తాను హాజరు విశ్వనాథ్‌ను సన్మానించినట్టు ప్రముఖ వైద్యులు డాక్టర్ మండవ శ్రీనివాసరావు జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి: ప్రముఖ సినీ దర్శకులు కే విశ్వనాథ మతికి ఆంధ్ర నాటక కళా సమితి అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరావు సంతాపం తెలియజేశారు. శృతిలయలు సినిమా విడుదలైన సందర్భంగా విజయవాడలో విశ్వనాథుని కలవడం జరిగిందని నాగేశ్వరావు తెలిపారు. మంగళగిరి సాహితి కళావేదిక కన్వీనర్ జి ధనుంజయరావు విశ్వనాథ్ మృతికి సంతాపం తెలియజేశారు.



డైరెక్టర్ కె. విశ్వనాథ్ గారితో (శృతిలయలు సినిమా)